ఇందులోని గ్రంథముల అనుక్రమణిక

లఘు గ్రంథములు

మూడవ భాగము

ఇందులో :

"కళాప్రపూర్ణ" డా. పం. గోపదేవ్

ప్రకాశకులు:
ఆర్య సమాజము, కూచిపూడి-522 313

అంబా దర్శన గ్రంథమాల - 2000 ప్రతులు

శ్రావణి 1993

వెల : 8-00

ప్రతులకు:

1. ఆర్యసమాజము, కూచిపూడి-522 313. (తెనాలి తాలుకా)
2. మాశెట్టి వేంకటేశ్వర రావు, 3-3-738,
   కంచరి బజారు, సికింద్రాబాదు-3.

ముద్రణ: SRISHMA IMPRESSIONS, Secunderabad-3.

అంబా దర్శన గ్రంథమాల

మహారాజపోషకులు:- రూ.15,000లు అంతకుపైన నిచ్చువారు
రాజపోషకులు:- రూ.10,000లు అంతకుపైన నిచ్చువారు
పోషకులు:- రూ.5,000లు అంతకుపైన నిచ్చువారు

మహారాజపోషకులు:

1. శ్రీమతి కొత్తపల్లి యామినీదేవి — కూచిపూడి
2. శ్రీ బెల్దె జగదీశ్వరయ్యశ్రేష్ఠి — సికిందరాబాద్
3. శ్రీ మాశెట్టి వేంకటేశ్వర రావు — సికిందరాబాద్
4. శ్రీ కొసరాజు మాధవయ్య — తెనాలి
5. డా.శ్రీ వై.వి. సుబ్బారావు, సరోజనీదేవి — గుంటూరు
6. శ్రీ గ్రంధి కామరాజు — విజయవాడ
7. శ్రీ కావూరి జయచంద్రవర్మ — కూచిపూడి
8. శ్రీ చదలవాడ అచ్చేశ్వరరావు, రాజ్యలక్ష్మి — కూచిపూడి
9. శ్రీమతి చదలవాడ లక్ష్మమ్మ — కూచిపూడి
10. శ్రీ మల్రెడ్డి గురవారెడ్డి — తూములూరు
11. శ్రీ చంద్రయ్య & సన్స్-అలవాల — సికిందరాబాద్
12. శ్రీ యం.యస్. బాలకృష్ణ, సుధాకర్ — సికిందరాబాద్
13. శ్రీ ఉప్పల రాజేశ్వర రావు — సికిందరాబాద్
14. శ్రీ కొసరాజు తిరుమలరావు, సూర్యకుమారి — కురుమద్దాలి
15. శ్రీ గుర్జె సుబ్బారావుగుప్త, నాంచారమ్మ — గుంటూరు
16. శ్రీ జక్కిడి సీతారామరెడ్డి — సికిందరాబాద్
17. శ్రీ తుమ్మల వల్లభయ్య — కూచిపూడి
18. శ్రీ నోముల స్వామిదాస్, శ్రీ శ్రీపతి వెంకటరావు — సికిందరాబాద్
19. శ్రీ వాసంశెట్టి రామకృష్ణారావు — వలసపాకల
20. శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ — గుంటూరు

రాజపోషకులు:

1.	శ్రీ కావూరి సంగయ్య	కూచిపూడి
2.	శ్రీ జె. వెంకటరావు	వరంగల్
3.	శ్రీ బి. శంకరలాల్	హైదరాబాద్
4.	శ్రీ యలవర్తి రామకోటయ్య, సీతారత్నం	కూచిపూడి
5.	శ్రీ కుమ్మరి పోచయ్య	సికిందరాబాద్
6.	శ్రీమతి బొర్రా వేంకటరత్నమ్మ	కూచిపూడి
7.	శ్రీ యం. భూపతిరావు, ప్రజ్ఞాపురం	హైదరాబాద్
8.	శ్రీ పరిదె శ్రీనివాసరావు, కనకలక్ష్మి	రేలంగి, గోదావరి(జి)
9.	శ్రీ వి.యస్.గుప్త	కొత్తగూడెం
10.	కీ.శే. మరిపెద్ది సిద్దయ్య ధర్మపత్ని చంద్రమ్మ	మర్మాముల
11.	శ్రీమతి చదలవాడ రాజ్యలక్ష్మి	కూచిపూడి
12.	శ్రీ తలశిల శ్రీరాములు	నాగాయలంక

పోషకులు:

1.	శ్రీ మేకా రామకృష్ణయ్య	కూచిపూడి
2.	శ్రీ జాస్తి వెంకటప్పయ్య, తులశమ్మ	కూచిపూడి
3.	శ్రీమతి దాసరి రామకోటమ్మ	కూచిపూడి
4.	శ్రీమతి కన్నెగంటి శైలసుత నవరత్నకుమారి	కూచిపూడి
5.	శ్రీ కోట్ల రమణారెడ్డి	సికిందరాబాద్
6.	శ్రీ పోలం వీరయ్య సోదరులు	సికిందరాబాద్
7.	శ్రీ కోడూరి సుబ్బారావు	సికిందరాబాద్
8.	శ్రీ దుర్గా సత్యనారాయణ, కృష్ణవేణి	తణుకు
9.	శ్రీ కావూరి శివరామయ్య	మోపిదేవి
10.	శ్రీ గడ్డిపాటి వేంకట కృష్ణయ్య	అమృతలూరు
11.	శ్రీ చుండూరి శ్రీహరిరావు, శాంతకుమారి	గుంటూరు
12.	శ్రీ మల్లాది సూర్యనారాయణ మూర్తి	రాజంపేట (తూ.గో.)

ఓమ్

వేదమే ఈశ్వరీయము

(బైబిల్ కురానులు కావు)

"తస్మాద్ యజ్ఞాత్ సర్వహుత ఋచః సామాని జజ్ఞిరే
ఛందాంసి జజ్ఞిరే తస్మాద్ యజు స్తస్మా దజాయత"

ఋ.10-90-9

"సర్వప్రాణులకు పరమపూజ్యుడగు పరమేశ్వరుని వలన ఋక్కులు, యజస్సు, సామము, అథర్వము నను వేదములుత్పన్నము లయినవి".

భారతీయులలో నార్యవిద్వాంసు లెల్లరు వేదము ఈశ్వరీయమని యంగీకరింతురు. మానవులకు సృష్టిప్రారంభమున పరమేశ్వరుడు ప్రసాదించిన జ్ఞానమే వేదము. అయ్యది ఋగ్ యజు స్సామాథర్వము లను నామములతో వ్యవహరింపబడుచున్నది. అందు మానవులకు మేలు కలుగుటకు వలయు విజ్ఞానమంతయు సంక్షేపముగ నిహితమై యున్నది. శుద్ధాంతఃకరణముగల అగ్ని, వాయువు, సూర్యుడు, అంగిరసుడు నను మహర్షుల హృదయములలో నయ్యది ప్రప్రథమమున స్ఫురించినది. ఆ మహర్షులు వేద ధర్మముల నిట్లు సాక్షాత్కారము చేసికొని ధర్మము నెఱుంగజాలని యితర మానవులకు బోధించిరి. వారు తమ తమ సంతానములకు బోధించుచు వచ్చిరి. సృష్టి ప్రారంభమునుండి నేటి వఱకు నిట్లు ఒకరి నుండి మఱియొకరు విని నేర్చుకొనుచు వచ్చినందున వేదము శ్రుతి యనియు పిలువబడుచున్నది.

వేదములు, ఉపనిషత్తులు, సూత్రగ్రంథములు, స్మృతులు, పురాణములు, ఇతిహాసములు నన్నియు వేదము లీశ్వరీయములని ముక్తకంఠముతో చెప్పుచున్నవి. ఆర్షసంప్రదాయముల ననుసరించు విద్వాంసులెల్లరు వేదము లీశ్వరీయము లనుటలో విమతులు కారు.

ఇట్లే క్రైస్తవులు బైబిల్ ఈశ్వరీయ మనుచున్నారు. మహమ్మదీయులు కురాన్‌షరీఫ్ ఈశ్వరీయము (ఇల్‌హామ్) అని నుడువుదురు. ఇట్లు వేదములు, బైబిల్, కురాన్ అన్నియు నీశ్వరీయములని చెప్పబడు చున్నప్పుడు, శ్రోతలకు - వినువారికి - ఇవియన్నియు నీశ్వరీయములేనా? లేక ఇందేదైన నొక్కటియే ఈశ్వరీయమా? అని సందేహము కలుగుట సహజము. అట్టియెడ ఏది ఈశ్వరీయమో నిర్ణయింపవలసిన యావశ్యకము కలుగుచున్నది. నిర్ణయము లేనినాడు మానవులు సందేహమునకు గుఱియై సత్యమును తెలిసికొనజాలక అసత్యమార్గము ననుసరింతురు. మానవులకు జీవనలక్ష్యము సిద్ధింపదు.

ఆర్యులు, క్రైస్తవులు, మహమ్మదీయులు నెల్లరు భగవానుని యునికి నంగీకరింతురు. భగవానునివలన జ్ఞానము లభింపకున్న మానవులు విజ్ఞులు కాజాలరను విషయమును కూడ వీరంగీకరింతురు. అందువలననే యెల్లరు నీశ్వరీయ జ్ఞానము నంగీకరింతురు. కాని, ఒకరు వేదమీశ్వరీయమనియు, మఱియొకరు "బైబిల్" అనియు, వేఱొకరు "కురాన్" అనియు ప్రచారము చేయుచున్నారు. కావున నీ మూటిలో నేది ఈశ్వరీయమో పరీక్షించి నిర్ణయింపవలసియున్నది.

ప్రపంచములో ప్రసిద్ధికెక్కిన భాషాతత్త్వజ్ఞులు ఎల్లరు 'వేదములు' ప్రపంచ సాహిత్యమున ప్రాచీనములని యంగీకరించుచున్నారు. వేదములు ప్రాచీనములనుటలో నెవరికిని సందేహము లేదు. 'బైబిల్ ప్రాతనిబంధన' కూడ మూడు వేలసంవత్సరములకు పూర్వము లేదనియు తరువాతనే ప్రచారమునకు వచ్చినదనియు ఇతిహాసములు నుడువుచున్నవి. ఇట్లే కురాన్ కూడ హాజరత్ మహమ్మదు నాటినుండియే ప్రచారమునకు వచ్చియుండుట (1300 సం.) ఎల్లరికి తెలిసిన విషయమే. కాబట్టి వేదములు ప్రథమ - ఈశ్వరీయములనియు 'బైబిల్' ద్వితీయ - ఈశ్వరీయమనియు, 'కురాన్' తృతీయ - ఈశ్వరీయమనియు నాయాగ్రంథ ప్రచారసమయమును బట్టి చెప్పవలసి వచ్చును. అటులయిన ఈశ్వరీయమునకు మూడు సంస్కరణములు (ఎడిషన్సు) అయినట్లు చెప్పనగును. అందువలననే మహమ్మదీయ ప్రచారకులలో కొందఱు కురాన్ 'లేటెస్టు ఎడిషన్' (అర్వాచీన సంస్కరణము) అనియు, అయ్యదియే యంగీ

కరింప దగిన దనియు, వేదములు, బైబిల్ ప్రాత సంస్కరణములు కావున ననంగీకార్యము లనియు చెప్పుచుందురు.

పై పంక్తులు చదివిన మీదట పాఠకుల మనస్సున వాస్తవమున ఈశ్వరీయజ్ఞాన మెయ్యది? దాని నెట్లు నిర్ణయింపవలయును? అందులకు వలయు పరీక్షణ మేమి? ఈశ్వరీయజ్ఞాన మెన్నడు కలుగవలయును? ఈశ్వరీయజ్ఞానమనేక పర్యాయములు కలుగునా? అను నిట్టి ప్రశ్నలు ఉదయించును. కాబట్టి ముందుగా నిట్టి ఈశ్వరీయ జ్ఞానమునకు కావలసిన పరీక్షణలను నిర్ణయింపవలసి యున్నది. దానినిబట్టి ఏది ఈశ్వరీయమో నిర్ణయింపవచ్చును. తక్కినవి యెందుల కీశ్వరీయములు కావో తెలిసికొనుటయు సులభమగును.

1. ఈశ్వరీయ జ్ఞానము సృష్టికి ఆరంభమున ప్రకాశింపజేయబడవలయును. లేకున్న ఈశ్వరుడు పక్షపాతి యగును.

మానవులలో జ్ఞానము స్వయముగా వృద్ధినొందజాలదు. జ్ఞానవంతుల సాహాయ్యముతో, అజ్ఞానులలో జ్ఞానము వర్ధిల్లును. కావున మానవ సృష్టి యేర్పడినపుడు వారికి జ్ఞానము కలిగించుటకై ఈశ్వరుడు జ్ఞానమును ప్రసాదించును. ఈశ్వరుడట్లు సృష్టికి ఆరంభమున మానవులకు జ్ఞానము నొసగక కాలాంతరమున నెన్నడో యిచ్చినపక్షమున నంత కాలము మానవుల నజ్ఞానమున నుంచి తరువాత మానవులకు జ్ఞానము నొసంగుట పక్షపాతము కాక మఱి యేమగును?

'బైబిల్' ఈశ్వరీయజ్ఞానమని యంగీకరింతుమేని బైబిల్ ప్రకటింపబడుటకు పూర్వమున బుట్టిన మానవులు ఈశ్వరీయ జ్ఞానమునుండి వంచింపబడినవారగుదురు. కావున ఈశ్వరుడు పక్షపాతి యగును. ఇట్లే కురాన్ విషయమునను ప్రశ్నింపనగును. దీనికి క్రైస్తవులు, మహమ్మదీయులు చెప్పు సమాధానమేమి? "బైబిల్ కంటెను పూర్వము ఈశ్వరీయ జ్ఞానము ప్రకటింపబడి యుండవలయు ననుటకు మేమంగీకరింతుము. అందువలన 'వేదములు' బైబిల్ కంటె పూర్వపు గ్రంథములై ఈశ్వరీయములు అనదగినవే. కాని, బైబిల్ కూడ ఈశ్వరీయమే. ఈశ్వరుడు అప్పుడప్పుడు మహాపురుషుల ద్వారా మానవులకు జ్ఞానము నందజేయునని అంగీకరింతుము" అని యందురేని అదియు సరికాదు.

పరమేశ్వరుడు సర్వజ్ఞుడు; సర్వవ్యాపకుడు; ఎల్లప్పుడు నుండువాడు. కావున మానవులకు వలయు జ్ఞానమునంతటిని ఒకేసారి ప్రసాదించును. అప్పుడు కొంత, ఇంకొకప్పుడు ఇంకకొంత ప్రసాదింపవలసిన యావశ్యక మేమున్నది? సర్వకాలములకు, సర్వదేశములకు, సర్వమానవులకు వలయు జ్ఞానము నొకేసారి సృష్టికి ప్రారంభమున ప్రసాదించిన దానిని క్రమముగా మానవులు ఒకరినుండి ఇంకొకరు నేర్చుకొను నవకాశము కలుగును. కావున పరమేశ్వరు డనేకపర్యాయములు జ్ఞానము నీయనావశ్యకము లేదు. స్వల్పజ్ఞానులైన వారు తమ నిర్ణయములను, నియమములను, మార్చుకొనవలసి యుందురు. సర్వజ్ఞుడైన పరమేశ్వరు డిచ్చు జ్ఞానమున సంస్కరణలకు దిద్దుబాటులకు తావుండదు. కాబట్టి ఈశ్వరుడు జ్ఞానము సృష్టికి ప్రారంభముననే ప్రసాదించి యుండవలయును. వేదజ్ఞానమే అట్టిది. అదియే ఈశ్వరీయము. బైబిల్ కాని కురాన్ కాని కాదు.

"ఆ యా సమయముల చరిత్రలను, సభ్యతలను చూచి భగవంతుడు జ్ఞానమును ప్రసాదించును. క్రీస్తు మూలమున చివరకు భగవానుడు తన జ్ఞానమును సంపూర్ణముగ మానవుల కందజేసియున్నాడు. (God finally completed His revelation through Christ).

ఇకమీదట ఈశ్వరీయ జ్ఞానము ఎవరికిని లభింపదు" అని క్రైస్తవు లందురు.

కాని క్రీస్తుకు పూర్వమే యనేక పర్యాయము లనేక మహాత్ములకు అనేక సమయములలో ఈశ్వరుడు జ్ఞానము ప్రసాదించినవాడు కదా ! అట్టి యెడ క్రీస్తుకు తరువాత మాత్రమేల ప్రసాదింపడు? క్రీస్తుకు తరువాత సభ్యతలోనూ, చరిత్రలోను మార్పులు రాలేదా? క్రీస్తునాటి సభ్యత నేడున్నదా? సభ్యతల మార్పుల ననుసరించి ఈశ్వరుడు జ్ఞానము నిచ్చు నెడల క్రీస్తుకు తరువాత నెన్నోసారు లీయవలసినవా డగును. కాబట్టి క్రైస్తవుల సమాధానము సరి యనరాదు. సృష్టి కారంభమున నొసంగిన జ్ఞానమే ఈశ్వరీయ మగును. అదియు ఋగాది వేదములే కాని యన్యము కాదు.

2. ఈశ్వరీయ జ్ఞానము ఒకానొక దేశమునకు సంబంధించిన భాషలో ప్రసాదింపబడరాదు.

కొండొక దేశభాషలో నీశ్వరుడు జ్ఞానమును ప్రసాదించి యుండు నెడల నా దేశవాసుల కా జ్ఞానము సులభముగ నేర్వదగిన దగును. ఇతరదేశవాసులకు కష్టసాధ్యమగును. అందువలన నీశ్వరుడు పక్షపాత దోషమునకు గుఱియగును. కావున నెల్లదేశముల వారును సమానముగ పరిశ్రమ మొనర్చి నేర్వదగిన భాషలో జ్ఞానము ప్రసాదించుట సము చిత మగును. కురాన్ అరబ్బీభాషలోను, బైబిల్ హీబ్రూ భాషలోను ఉన్నవి. ఆ భాషలు సర్వదేశవాసులకు సమానముగ నందు బాటులో లేనివిషయ మెల్లరికి విదితమే. కాని వేద మట్లుగాక సర్వభాషలకు మాతృకయైన వేదభాషలో నున్నది. ఈ వేదభాష ప్రత్యేకముగ కొండొక దేశమునకు సంబంధించిన భాష యనరాదు. వేదభాష యెల్లదేశవాసులకు సమాన పరిశ్రమ మొనర్చి నేర్వదగిన భాష. అది యొక దేశవాసికి సుల భము, మఱియొక దేశవాసికి కఠినము అనరాదు. అందువలన వేదమే ఈశ్వరీయమగును. కాని బైబిల్ కాదు. కురాన్ అంత కంటెను కాదు.

ప్రపంచమునగల దేశములందు వ్యాపకములో నున్న సంస్కృతభాష, పార్సీభాష, గ్రీక్ భాష (హీబ్రూభాష) రోమన్, జర్మన్ భాషలు, ఇంగ్లీషు మఱియితర - ఐరోపా దేశభాషలు నన్నియు, వేదభాషనుండియే జన్మించినవి. సృష్టికి ఆరంభమున మహర్షులేభాషయందు ఈశ్వ రీయ జ్ఞానమును బొందిరో యా వైదిక భాషనే మానవుల కెల్లరకు నేర్పియుండిరి. మానవులు క్రమముగ బిన్నభిన్నదేశములకేగి యట నివ సించినందున వైదికభాష క్రమముగ నపభ్రంశమై నేటి భిన్నభిన్న భాషల రూపమును ధరించినది.

భారతదేశము ప్రథమ మానవసృష్టి యేర్పడిన త్రివిష్టపమునకు అతి సమీప మగుటంజేసి యట నివసించినవారు వైదిక భాష నెక్కుడు భ్రంశము చేయక యట్లే వాడుచు వచ్చిరి. భారతదేశమునందును క్రమముగ బహుకాలమునకు వైదిక భాషలో కొంతమార్పు కలుగక తప్పినది కాదు. సంస్కృతము వైదికభాషాపరిణామమే యనదగియున్నది. పాణిన్యాదులచే వ్యాకరణము రచియింపబడి నియమబద్ధ మొనర్చుట

వలన నెక్కుడుగ భ్రంశము కాక వైదికభాష కొలదిగానో, గొప్పగానో భారతవాసులకు సన్నిహితభాషగానే నేటివఱకు నుండుట వారి భాగ్య మనకతప్పదు. త్రివిష్టపమున కతిదూరములైన ద్వీపాంతరములలో వెళ్ళి నివసించినవారిలో వైదికభాష మిక్కిలిగా భ్రంశమై వివిధభాషల రూప మున నది పరిణమించినది. ఎంత భిన్నత కలిగినను నేడు కూడ ఐరోపా దేశభాషలు వైదిక భాషా వికృతములని సిద్ధపఱచుట మిక్కిలి కష్టము కాదు. కావున వైదికభాష సార్వభౌమిక భాష యనుట నిర్వివాద సిద్ధము. అందువలననే వేదము ఈశ్వరీయ మనుటయును స్పష్టము.

వేదభాష - సంస్కృతభాష సర్వభాషలకు మాతృకయనుటకు అనేక ప్రమాణములు లభించును. చూడుడు; ఈ పాశ్చాత్యవిద్వాంసు లేమనుచున్నారో !

"It is the most regular language known and is especially remarkable, as containing the roots of the various languages of Europe, and the Greek, Latin, German of Selavonic". BARIN CUVIER

(Lectures of the Natural Science)

"సర్వజ్ఞాతభాషలలో సంస్కృతము మిక్కిలిగ నియమిత భాష. ఇంతేకాక, నేటి ఐరోపా దేశభాషలకును, ప్రాచీన భాషలకును చెందిన ధాతువు లాభాషయందు లభించుటవలన సంస్కృతము అద్భుతమైన భాష యనదగును."

బేరిన్ క్యూ వియర్

"The Sanskrit answers to Greek, as face answers face in a glass. The translation into it of the new testment will be perfect, while it will be almost verbal it will be published with the Greek on the opposite page, as soon as we can procure Gree types. You will find the verb in the corresponding mood and tence, the noun and adjective in the corresponding case and gender, the idiom and government are the same, where the Greek is absolute so is the Sanskrit and in many instances, the primitives or roots are the same".

Rev Dr. BROUNE

అద్దమున కనబడు ముఖ ప్రతిబింబము ముఖముతో నెట్లు పోలి

యుండునో అట్లే సంస్కృతముతో గ్రీక్ భాష పోలియుండును. గ్రీక్ బైబిల్ సంస్కృతమున ననువదింపబూనినచో శబ్దములలోను, వ్యాకర ణము నందును నెక్కుడు భేదము కనిపింపదు.

గ్రీక్ భాష సంస్కృతమునుండి యేర్పడిన భాషయే. పాకాల్, పిచ ర్డ్, విలియంజోన్సు, బాప్, శలీగల్, ముర్రె, స్టీవర్టు, మున్నగు మహాశయు లీయభిప్రాయమునే కలిగియుండిరి. ఇందు బాప్ మహాశయుని శబ్దములు సువర్ణాక్షరములతో వ్రాయదగినవై యున్నవి.

"At one time Sanskrit was the one language spoken all over the World".

'ప్రపంచమం దంతటను నొకప్పుడు సంస్కృతమే వ్యావహారిక భాషగా నుండెను.'

Edimburgh Rev. Vd XXXIII P.63

పైన చూపిన ప్రమాణములను బట్టి వేదములభాష ఒకానొకదేశ విశేషమునకు చెందినది కాదనియు, నెల్లరు నాభాషనే ప్రథమమున నేర్చు కొనియుందురనియు, తరువాత భిన్నభిన్నదేశభాష లన్నియు నా వైదిక భాషనుండియే యేర్పడినవనియు స్పష్టమగుచున్నది. అందువలన ఋగాది వేదములే ఈశ్వరీయము లగును. కాని బైబిల్ కాని, కురాన్ కాని యెన్నటికిని ఈశ్వరీయములు కాజాలవు.

3. ఈశ్వరీయ జ్ఞానము సృష్టినియమములకు విరుద్ధమెన్నడును కారాదు

పరమేశ్వరుడు బ్రహ్మాండమును నియమబద్ధముగా నడుపుచున్నాడు. ఏవో కొన్ని నియమములు ప్రపంచమున వివేకులకు గోచరించుచునే యున్నవి. ఆ నియమముల ననుసరించియే ఈశ్వరుడు అవ్యక్తమయిన సూక్ష్మప్రకృతిని వ్యక్తమగునట్లు చేసి ఈ సృష్టినంతటిని సృష్టించియు న్నాడు. నేటి వైజ్ఞానికులా నియమముల నన్వేషించి వానిమూలమున ప్రాకృతిక పరిశోధనలు చేయుచున్నారు. వింత వస్తువులను గనిపెట్టు చున్నారు. మారణసాధనములతో బాటు ఎన్నియో క్రొత్తలు కనిపెట్టబ డుచున్నవి.

వేదములు స్వయముగా 'పరమేశ్వరుడు సృష్టిని నిర్మించుటకు

పూర్వము దానికి (సృష్టికి) వలయు నియమములు నిర్ణయించుకొని తదుపరి సృష్టించినట్లు' చెప్పుచున్నవి. వేదమునందట్టి నియమములు కాననగును. కావుననే వేదము ఈశ్వరీయ మనబడుచున్నది. అందు వైజ్ఞానికుల నిశ్చితములకు విరోధము గూడ కనిపింపదు. విజ్ఞానము గుప్తముగానున్న ప్రాకృతిక రహస్యములను వెల్లడించును. అంతకుమించి యది చేయునది యేమి యున్నది? కావున వైజ్ఞానిక సిద్ధాంతములు ఈశ్వరీయ జ్ఞానమునకు విరుద్ధములు కావు. భూమి గుండ్రముగా నుండును. అది తనయక్షముపై తాను తిరుగుచు సూర్యునిచుట్టు తిరుగుచుండును. ఇది వైజ్ఞానికసత్యము. వేదమున కీ వైజ్ఞానిక సిద్ధాంతము విరుద్ధము కాదు. ఇట్లే ఇతర విషయములును. ఇట్టి విషయముల నంగీకరింపని గ్రంథము ఈశ్వరీయ మెన్నడును కాదు. బైబిల్‌లోను కురాన్‌లోను విజ్ఞానమునకు విరుద్ధములైన విషయము లనేకములున్నవి. కావుననే పాశ్చాత్యదేశములందు విజ్ఞానము వృద్ధినొంద నారంభించిననాటినుండి బైబిల్ మీద పాశ్చాత్యులలో శ్రద్ధ తగ్గ నారంభించుట మనమెఱుగనిది కాదు. విజ్ఞానవృద్ధి బైబిల్ మతము మీద గొడ్డలిపెట్టు అనక తప్పదు.. అందువలననే బైబిల్ మతావలంబులు బైబిల్ సిద్ధాంతములకు విరుద్ధముగా విజ్ఞాన సిద్ధాంతములు కనిపెట్టిన గైలీలీ, కాపర్నికస్ మున్నగు వైజ్ఞానికులకు మరణదండనలు విధించుట చారిత్రికులకు తెలియని విషయము కాదు. కావున బైబిల్ ఈశ్వరీయము కాదనుట నిశ్చిత సిద్ధాంతము.

పాశ్చాత్య విద్వాంసులును బైబిల్ ఈశ్వరీయము కాదనియు స్పష్టముగా వివరించి యున్నారు. చూడుడు. థామస్ పేన్ మహాశయుడేమి వ్రాసియున్నాడో, తన 'తర్కకాలము' (Age of Reason) అను ప్రసిద్ధ గ్రంథమున -

"Revelation a communication of something which the person to whom the thing is revealed did not know before for if I have done a thing, or seen it alone it needs no revelation to tell me I have done it or seen it. Revelation therefore cannot be applied to anything done upon earth of which man is himself the actor or witness and consequently all the historical and the anecdotal part of the Bible which is almost

the whole of it is not within the meaning and compass of the word revelation and therefore is not the word of God".

Age of Reason P.P.10

'ఎవనికి ఈశ్వరీయజ్ఞానము కలుగునో వానికది పూర్వమే తెలిసియే యుండిన నది ఈశ్వరీయ మనబడదు. నే నెఱిగి నదియో, లేక నేను చూచినదియో తెలుపుట కీశ్వరీయజ్ఞానమేల? పూర్వజ్ఞాత విషయములను పూర్వదృష్ట విషయములను తెలుపునది ఈశ్వరీయగ్రంథ మనబడదు. బైబిల్ లో నే కొలది భాగమో తప్ప మిగిలిన దంతయు మానవుల చరిత్రములతో నిండియున్నది. అందువలన నయ్యది ఈశ్వరీయమని చెప్పదగదు'

ఈ గ్రంథకర్త స్పష్టశబ్దములలో బైబిల్ ఈశ్వరీయము కాదని వర్ణించుట చూడనగును. ఇతి డింకను అనేక యుక్తులు తన గ్రంథ మున ప్రదర్శించియున్నాడు. కాబట్టి బైబిల్ ఈశ్వరీయము కాదనియు వేదములే ఈశ్వరీయములనియు సిద్ధమగుచున్నది.

వైదిక ధర్మము సత్యధర్మము; సార్వభౌమిక ధర్మము. విజ్ఞానమున కది విరుద్ధము కాదు. విజ్ఞానమునకు విరుద్ధమగునది ధర్మము కాదు. హేతుబద్ధమే ధర్మమగును. ప్రొఫెసర్ హక్సలే వ్రాసిన వాక్యము లిట స్మరణీయములు.

"The Science and true Religion are two sisters and the separation of either from the other is sure to prove the death of both. Science prospers in proportion as it is religious and Religion flourishes in exact proportion to the scientific depth and firmness of its basis".

సత్యవిజ్ఞానము, సత్యధర్మము రెండును అక్కచెల్లెండ్రవంటివి. వానిని వేఱుచేయుట రెంటినాశనమునకు హేతువగును. విజ్ఞానము ఎంతగా ధర్మపరాయణమగునో అంతగా వర్ధిల్లును. అట్లే వైజ్ఞానిక నియమము లాధారముగ గల ధర్మము కూడ మిక్కిలిగ వృద్ధిచెందును.

ఋగాది వేదజ్ఞాన మీ నియమముల కెంతయు ననుకూలముగా నుండును. అందువలన బైబిల్ ఈశ్వరీయము కాదనియు ఋగాదివేద ములే ఈశ్వరీయములనియు ఋజువగుచున్నది.

4. ఈశ్వరీయజ్ఞానమునందు సమస్త సత్యవిద్యల మూల సిద్ధాంతము లుండి-యుండవలయును.

ఇయ్యదియు వేదమునందే లభించును. బైబిల్‌లోకాని, కురాన్‌లో కాని సమస్తవిద్య లున్నవని యెవరు చెప్పగలరు? వేదమున సమస్త విద్య లున్నవనుట కెన్నో ప్రమాణములు లభింపగలవు. శతపథ బ్రాహ్మణ మేమనుచున్నదో చూడుడు:

"తద్ యత్తత్ సత్యం త్రయీ సా విద్యా"

'సత్యమే త్రయీవిద్య - వేదము' అని వాక్యాభిప్రాయము. వేదము సృష్టికి పూర్వము, ప్రళయమునందు నుండునని గ్రంథములలో పలు చోట్ల చదువుదుము. అనగా వేదములు తదంతర్గతజ్ఞానము నిత్యమని యభిప్రాయము. భగవానుడు గూడ దానిని రచియింపడు. కేవలము ఋషులకు స్ఫురింపచేయును. అందువలననే వేదములు అపౌరుషేయము లనియు చెప్పబడును. అట్టి వైదిక విజ్ఞానమును, ధర్మమును, వ్యాపింప జేయుటకు మహర్షి దయానందుడు క్రీ.శ.19వ శతాబ్దమున ఆర్యసమాజ మును స్థాపించి "వేదము సత్యవిద్యల పుస్తకము. వేదమును చదువుట - చదివించుట, వినుట - వినిపించుట ఆర్యుల కెల్లరకును పరమధ ర్మము" అని నియమించియున్నాడు.

ఓమ్ తత్ సత్

ఓమ్ స్మర

(నామస్మరణము)

'కలౌ నామస్మరణమ్' 'కలికాలమున నామస్మరణమే' మోక్షదాయక మను లోకోక్తిని పురస్కరించుకొని నేడుభక్తులు అఖండనామ సంకీర్తనాదులను నడుపుచున్నారు. భక్తులు స్వయముగా రాత్రిం దినములు నిరంతరముగా నామసంకీర్తనము చేయజాలరు. కావున వారు భక్తులు కానివారికి 'భోజనాది వసతులు, దక్షిణలు నేర్పాటు చేసి, లేదా గంటకో రోజుకో యింతధనము ప్రతిఫలముగా నిత్తుమని చెప్పి వారిచే కీర్తనలు చేయించుచుండుటయు ఎడనెడ మనము చూచుచున్నాము. ఇంతేకాక యీయఖండనామసంకీర్తనలు తమ కొఱకు తమముక్తికొఱకు తాముచేసికొనుటకు బదులు ఇరుగు పొరుగువారికి కూడ ముక్తి నొసంగుటకు కాబోలు లౌడ్‌స్పీకర్లు పెట్టి నిరంతరము రణగుణధ్వని చేయుట పరిపాటియైనది. ఇదియంతయు భక్తిప్రదర్శనమనిభక్తులు తదితరులు నెంచుచున్నారు. ఇట్టి కృత్రిమ భక్తి నంగీకరింపనివారి కిది యెంతయు నభ్యంతరకరమగుటయే కాక, వారు ఈ నామసంకీర్తనములు భక్తిప్రపత్తులవ్యాజమున నానాటికి ముదిరి వెఱ్ఱితలలు వేయుచున్నవి. మూఢాచారములకు దేశమున నంతము కనిపింపకున్నది. కొందఱు దాంభికులు, తిలకధారులు, తాపసవేషభూషలతో నాడంబరముగ తాళములను తప్పెటలను సమ కూర్చుకొని 'హరేరామ హరేరామ రామ రామ హరేహరే' అనియు 'హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే' అనియు 'రామరామ రామరామ' 'కృష్ణకృష్ణ కృష్ణకృష్ణ' అనియు నిరంతరము భజనలు చేయుచు చేయించుచున్నారు. వీరు కర్తవ్యములయిన నిత్యకర్మల

నాచరింపరు. బ్రహ్మయజ్ఞము, దేవయజ్ఞము, పితృయజ్ఞము, అతిథి యజ్ఞము, బలివైశ్వదేవము నను పంచమహాయజ్ఞములు నిత్యకర్మలు. శాస్త్రవిహితములు, ప్రాణిహితకరములు. సంఘశ్రేయస్కరములును. కాని వానిని పాటింపక వ్యర్థముగ కాలము నయించుచుందురు. నిత్యము పాపాచరణము లసత్యభాషణాదు లెన్నియో నిరభ్యంత రముగా నాచరించుచు కేవల హరినామస్మరణము చేసిన నవియ న్నియు హరించిపోయి, ముక్తి సుఖము సులభముగ లభించునని యెంచుచుందురు. భగవంతుడు తననామమును స్మరించిన మాత్ర మున పాపులపాపములను క్షమించుననియు మోక్షానందము ననుభ వింపజేయుననియు వీరియభిప్రాయము. కొందఱు మహానుభావులు జీవితమంతయు దా మేమిచేసినను దేహావసానసమయమున భగవంతు నేదోయొక నామముతో స్మరించినమాత్రమున తమకు సద్గతి కలుగు నని యెంచి, మరణమాసన్నమైనపుడు రామనామమో కృష్ణనామమో స్మరింప యత్నింతురు. జీవితమున నెన్నడు నానామము జపింపనం దున వివశావస్థలో నెట్లు స్మరింపగలరు? ఇంక కొందఱు మరణ సమయమున భగవంతునినామము స్మరింప స్మృతి యుండదేమో యని యెంచి తనసంతానమునకు భగవంతుని నామము పెట్టుకొని, యాసంతానమును బిలిచినను భగవన్నామస్మరణ చేసిన ట్లెంచి భగ వంతుడు తమకు సద్గతి నియ్యగలడని భావించువారును గలరు. మరణాసన్నుడైన వ్యక్తి తన్ను స్మరించుచున్నాడో లేక నిజసంతా నమునే పిలుచుచున్నాడో తెలిసికొన జాలనంతటి యమాయకునిగా భగవంతుని వీరెంచుచున్నారు. అంతటి యమాయకుడైన భగవంతు డీమాయికుల కెట్లు సద్గతి నీయగలడో పాఠకు లూహింతురు గాక! భగవన్నామసంకీర్తనమున కెట్టి దుర్దశ కల్గినదో చూడుడు! కొందఱు హిందూమతాభిమానులు మతాంతరులు చేయు ప్రచారమునకు ప్రతీ కారముగ అఖండ నామ సంకీర్తనములు చేయించినందున హిందూ మతము వర్ధిల్లుననియు, క్రైస్తవుల మాయలకు మందులకు లోబడి వారిమతమును స్వీకరించువారి నా యా మతములందు చేరకుం డునట్లు చేయుట కిది చక్కని యుపాయమనియు నెంచుచున్నారు.

వీరి నేమనవలయునో తెలియదు. తెలియని బీదజనులకు ధనము నిచ్చి, వస్త్ర వాహనముల నిచ్చి, మందుమాకుల నిచ్చి చదువుల నేర్పి, క్రైస్తవులుగా మార్చుచుండుట కన్నులార జూచుచు అఖండనామసంకీర్తనముతో నాబీదలు మతాంతరులు కాకుండ నరికట్టనెంచువారెంతటిబుద్ధిమంతులో యాలోచింపుడు! ఈ యఖండనామసంకీర్తనము, అదియును కూలి కాసపడి భజనచేయువారి నామసంకీర్తనమా బీదవారిని మతాంతరులు కాకుండ నెట్లు వారింపగలదు. ఎవరో విధివిరామము లేకుండ నామస్మరణము దిక్కులు మాఱుమ్రోగునట్లు చేసినంత మాత్రమున నా బీదల కడుపుచిచ్చెట్లు చల్లారగలదు? అది వారి తనువులను గాపాడుటకు గుడ్డల నియ్యగలదా? దిక్కులేక రోగములతో నలమటించువారికి ఔషధపానీయములను చేకూర్చగలదా? త్రాగ నీరులేనివారికి బావులను త్రవ్వి పెట్టగలదా ? హరినామ సంకీర్తనమువలన నీ సదుపాయములు కలుగ జాలవు కదా! అట్టియెడ వీని కొరకై మతాంతరు లగుచున్న బీదల నీ నామస్మరణ మెట్లు వారింపగలదు ? ధనాది సౌకర్యాపేక్షతో హిందువులు క్రైస్తవాది మతములను స్వీకరించి హిందూమతమును త్యజించుచుండగా హిందూమతము వర్ధిల్లుటెట్లు? హిందూమతము వృద్ధికావలయు నని నను, హిందువులు మతాంతరులు కాకుండ వలయు నవినను దానికి తగినకారణము లాలోచించి ప్రవర్తింపక పిడుగునకు బియ్యమునకు నొకే మంత్ర మన్నట్లు అన్నింటికి హరినామస్మరణమే పరమౌషధమని యెంచి నిరర్థక నామోచ్చారణము చేసినను, చేయించినను నే మగును. వ్యర్థ వ్యయప్రయాసలు తక్క మఱియొండు ప్రయోజనము కలుగదు.

వాస్తవమున భగవన్నామస్మరణము నిరర్థకము కాదు. భక్తితో, చిత్తశుద్ధితో, అనన్యాసక్తమనస్సుతో జేసిన నామసంకీర్తనము చేయు వానికి లాభము కలిగింపదని మా యాశయము కాదు. దేహావసాన సమయమున భగవన్నామస్మరణమువలన జీవునకు సద్గతి కలుగదనియు మా యభిప్రాయము కాదు. దేహావసాన సమయమున

భగవన్నామమైన ప్రణవము (ఓమ్)ను స్మరింపుమని వేద మాదేశిం చుచునే యున్నది. 'ఓమ్ స్మర' ఇది యజుర్వేదవాక్యము, ఓమ్ భగవన్నామములలో నుత్తమనామము. ఈ నామముతోనే భగవం తుని స్మరియింపుమని వేదాదేశము. దానిని విడిచి నేటిభక్తులు భక్తాభాసులు-భక్తమ్మన్యులు రామకృష్ణాదినామములతో సంకీర్తనములు చేయుచున్నారు. రామాదినామములను వారు కీర్తించునపుడు వారి మనస్సులలో బోధపడు వ్యక్తు లెవరు? దశరథ పుత్రుడు, సీతాపతి, కౌసల్యానందనుడు, రావణసంహారకర్తయు నగు రాముడు రామ నామసంకీర్తనమువలన స్మరియింపబడునా? లేక సృష్టిస్థితిలయము లకు కారణభూతుడైన పరమేశ్వరుడు స్మరియింపబడునా? ఇట్లే కృష్ణ నామసంకీర్తన మొనర్చువారికి వసుదేవనందనుడు, రుక్మిణీ పతి, కంస చాణూరాదిరాక్షససంహారియు బుద్ధిగోచరుడగునా? లేక గోపీవస్త్రాపహారి, నవనీతచోరుడు, జారచోరశిఖామణి, రాధాలోలుడు, గోపీ పీనపయోధరమర్దన చంచలకరయుగశాలి వారి మనోవీధులలో చిందులు ద్రొక్కునా? లేదా 'జన్మా ద్యస్యయతః' అను బాదరాయణ సూత్రబోధిత సృష్టి స్థితి లయములకు మూలకారణమగు పరమానం దదాత పరమపురుషుడు వారి హృదయాకాశమున గోచరించునా? కొంచెము ఆలోచించి చూడుడు. పురాణశ్రవణ నెపమున రామాయ ణభాగవతాది ఆధునిక గ్రంథముల కథా భాగములను రాసక్రీడలను శ్రవణానందముగ విని కాలక్షేప మొనర్చు సామాన్యమానవుల కాయా కథానాయకులైన రామకృష్ణులు దృగ్గోచరు లౌదురే కాని రామకృష్ణ నామసంకీర్తనమువలన సృష్టిస్థితిలయములకు కారణభూతుడగు పర మేశ్వరు డెట్లు వారిమనః పటలమున నంకితుడగును? కాబట్టి నేటి సంకీర్తనములు మతవర్ధకములు, మోక్షదాయకములు నగు ననుట కల్ల. రామకృష్ణాది మహానుభావులస్మరణము కూడ వ్యర్థమని తలం చుచున్నారా? అని పాఠకులు మమ్ము ప్రశ్నింపవచ్చును. అట్లు ప్రశ్నింపవలదనము. రామకృష్ణులవంటి మహాపురుషులను స్మరింపవల

దనుటకు మే మెంతవారము? నామకీర్తనము చేయుభక్తమహాశయుల నొకమాటు ప్రశ్నించి చూడుడు? మీరు రామకృష్ణనామములతో ఆ నామాంకిత మహాపురుషులను స్మరించుచున్నారా? లేక సృష్టి స్థితిలయములకు కారణభూతుడగు పరమేశ్వరుని స్మరించు చున్నారా? అని. నామకీర్తన మొనర్చువారు పెక్కురు కూలికి వచ్చువారుందురు. వారికీ జిజ్ఞాసతో బనియేమి? నిశ్చిత సమయ మువఱకు నోరు నొవ్వగా అఱచి, తమకూలి గిట్టినదా లేదా? అని చూచుకొనుటయే వారి కర్తవ్యము. వా రెవరిని స్మరించుచున్నారో వారికేల? ఇక నీ యఖండ నామకీర్తనమునకు వ్యవస్థచేయు వారు వారు స్వయముగ కీర్తనచేయరు; స్మరియింపరు. ఇతరులచే చేయించి ధార్మికనామబిరుదాంకితులగుటయే వారికి కావలసినది. ఇక యిట్టియాందోళనములు చేయించుటకు కంకణము కట్టుకొని - గురుపీఠముల నలంకరించువారిందు కొందఱుందురు. వారికి కావల సినది లోకైషణ - లోకప్రతిష్ఠ; ధర్మోద్ధారకులు, మతోద్ధారకులు, నని మహాజనులచే నభినందింపబడుట. కాబట్టి యీసంఘములలో తామొనర్చు నామసంకీర్తనము మహాపురుషసంబంధమైనదా? లేక పరమేశ్వరునకు సంబంధించినదా? అని చింతించువారెవరు? వారి నెవరైన నిట్లు ప్రశ్నించినచో ప్రశ్నించువారు వారిదృష్టిలో నాస్తికు లగుదురు. ప్రశ్నకు సమాధానము పొందలేక పోగా పైపెచ్చు ప్రశ్నిం చువారు పదిమందిలో నవమానితు లగుదురు.

నామస్మరణమును విధించిన శాస్త్రములు పరమేశ్వరుని నామ ములలో ప్రణవము స్మరణయోగ్యమని విధించుచున్నవి. పతంజలి మహర్షి చిత్తస్థిరతకు నుపాయములను జెప్పుచు యోగశాస్త్రమునందు, 'తస్య వాచకః ప్రణవః', 'తజ్జపస్తదర్థ భావనమ్' అని సూత్రించియు న్నాడు. పరమేశ్వరునినామము ప్రణవము - 'ఓమ్'. అట్టి ప్రణవమును జపముచేయుచువాని యర్థమును భావించుట వలన చిత్తనిరోధ మేర్పడుననియు చిత్తము నిరోధింపబడినకాని ఆత్మసాక్షా

త్కార మేర్పడదనియు వర్ణించియున్నాడు. అట్టి నామస్మరణము ముక్తికి సాధనము కాగలదని మహర్షి యభిప్రాయము. అంతేకాని యేకాగ్రతకు భంగము కలిగించు మేళతాళములతో నాడంబరముగా జేయునఖండ నామసంకీర్తనములు మోక్షదాయకము లెట్లు కాగలవు? రామాది నామములతో దశరథపుత్రాదులను కాక పరమేశ్వరుని భజింప ననువుకాదా? యని కొందఱు బుద్ధిమంతులు ప్రశ్నింపవచ్చును. పరమేశ్వరునకు ప్రణవమేకాక యనేక నామములు ఇంద్రమిత్రవరుణాదులు కలవు. రామకృష్ణాదులనందు చేర్పవచ్చును. కాని రామ! అని స్మరించినపుడు స్మరణకర్త మనస్సున దశరథపుత్రుడు కాక, 'రమన్తే యోగినో యస్మిన్' ఎవనియందు సమాధినిష్ఠులైన యోగులు రమింతురో యట్టి రాముడు ఆనందస్వరూపుడు వర్తింపవలయును. ఇట్టి యర్థస్ఫురణతో రామనామసంకీర్తన మొనర్చిన నది ముక్తి సాధనమగుటలో నెట్టి సందియమును లేదు. నేడొనర్చు అఖండనామసంకీర్తనములో నీ విధికి తా వెక్కడ? ఇది యొక అల్లరితో కూడిన భజనపటాటోపము. ఈ భజనలో నైతిహాసిక ప్రసిద్ధిగల మహాపురుషులను స్మరించుటయు జరుగదు. అయ్యది జరిగినను కొంతప్రయోజన ముండును. నిజముగ ఏకపత్నీవ్రతుడు, సోదరప్రియుడు, ప్రజారంజకుడు, దుష్టసంహారకుడు నగు రాముని స్మరించు వాని జీవితమున నా సుగుణసంపత్తి చూడనగును. అది లేనివాని సంకీర్తనము దంభమాత్రమని గుర్తింపవలయును. కావుననే యివి నిరర్థకములని యనవలసివచ్చుచున్నది.

నామ సంకీర్తనము చేయువారు ముందుగా భగవంతుని నామధామములను, స్వరూపాదులను బాగుగ నెఱుంగవలయును. అటుపైన కీర్తనమో స్మరణమో చేయవలయును. దేనిని స్మరించుచున్నాడో, ఎందులకు స్మరించుచున్నాడో, స్మరణవిధానమేమో తెలియకయే చేయు స్మరణము వ్యయ ప్రయాసలకు లోనుచేసి, స్మరణకర్త జీవనమును వ్యర్థము చేయును. జీవితమంతయు వేదవిహితకర్మలు

కర్తవ్యములుగా నెంచి చేయుచు, నిత్యము భగవంతుని భజించు పరమభక్తులు అంతకాలమున ఓమ్మను నామముతో భగవంతుని స్మరించుచు దేహమును విడిచి యానందము ననుభవింతురు. అంతేకాని 'కలౌ నామస్మరణ' మ్మను లోకోక్తి నుట్టంకించుచు నిచ్చవచ్చినట్లు ఏదోచేసి, చేయవలసిన దింతకు మించి యీ కలికాలమున లేదని భ్రమించువారికి సద్గతి యెన్నడును కలుగదు. కాని దుర్గతి కలుగకపోదు. వారి కిహము పరము రెండును చెడును.

ఓమ్ తత్ సత్

ఓమ్

అహం - నేను

(జీవ స్వరూపము)

"న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః
న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్"

'నేను, నీవు, ఈ రాజులెల్లరు నెల్లపుడు నుందుము' అని భగవద్ గీతావచనము.

సంస్కృతమున 'అహమ్' అనియు, తెలుగున 'నేను' ఆంగ్లేయమున 'ఐ', ఆర్యభాష-హిందీలో 'మై' అనియు చెప్పబడు వస్తువెయ్యది? లోకమున ఘటము, పటము, గుఱ్ఱము, ఎద్దు, ఏనుగు, వృక్షము, నది, కాలువ, పర్వతము, భూమి, ఆకాశము, అను నిట్టి పదములు వినుచుందుము. ఈ పదములు వినిన వెంటనే వినిన వ్యక్తి కా యాపదమేదోయొక వస్తువును బోధించును. ఘటము అను పదము వినుటయే తడవుగ నీటిని తెచ్చుటకో, తీసికొని వెళ్ళుటకో అనువగు నొకపాత్ర వినిన వ్యక్తి మనస్సుకు స్ఫురించును. గుఱ్ఱము అను పదము వినిన తోడనే నాలుగు కాళ్ళుకలిగి ఆ కాళ్ళకు చీలని గిట్టలు కలిగి, మెడమీద జూలుగలిగి యుండు జంతువు ఒకటి వినిన వ్యక్తి మనస్సుకు బోధపడును. ఇట్లే యితర పదములు కూడ వాని వానికి తగిన వస్తువులను మనుజులకు స్ఫురింపజేయును. అందువలననే భాషాభిజ్ఞులు పదము నర్థబోధకముగ జెప్పుదురు; "వాచ మర్థోనుధావతి".

ఇట్లే లోకమున నెల్లరు అహమ్-నేను-ఐ-మై అను పదములనా యా భాషలలో ప్రయోగింతురు. మనము తెలుగున 'నేను'

అనియు సంస్కృతమున 'అహమ్' అనియు ననుచున్నాము. ఈ పదములను వినినపుడు వినిన వ్యక్తికి తెలియువస్తు వెయ్యది? తెలుగు భాషను వాడు ప్రజలలో 'నేను' అను పదమును ప్రయోగింపని వ్యక్తి యొక్కడును నుండడు. మాటాడనేర్చిన ప్రతి వ్యక్తియు 'నేను' అను పదము నెల్లవేళల వాడుచునేయుండును. నేను వచ్చుచున్నాను. నేను జూచుచున్నాను. నేను నిద్రించుచున్నాను నే నెఱ్ఱగా, లావుగా, పొడవుగా నున్నాను. ఇట్టి ప్రయోగములు నిత్యము ప్రతి వ్యక్తియు పలుమాఱు ప్రయోగించును. కాని యీ నేను పదమును బ్రయోగించు వ్యక్తికిగాని, ఆ పదమును విను వ్యక్తికిగాని ఆ పదమేమి బోధించును? పాఠకులారా, ఎప్పుడైనను మీ రీ పదమును గూర్చి యిట్లు ప్రశ్నించుకొనియున్నారా? ప్రశ్నించికొని యుందురేని మీకీ ప్రశ్నకు దొరికిన సమాధానమేమి?

ఒక యువకుడు నిలువుటద్దమున కెదురుగ నిలువబడి తన ప్రతిబింబము నందు కనులారచూచి 'నేను' ఎఱ్ఱగా నున్నాను. 'నేను' లావుగ నున్నాను. 'నేను' పొడవుగ నున్నాను. నాయంత పొడవు నా స్నేహితులలో నెవరున్నారు? నా యంతటి యందగా డెవడున్నాడు? నా యంతటి బలవంతుడు మాత్ర మెవడు గలడు? అని యనుకొనును. ఆ యదనుననతని కీ 'నేను' అను పదమేమి బోధించుచున్నది? ఎఱుపు, ఎత్తు లావు, అందము బలము ఇవి యన్నియు శరీర ధర్మములే కదా! తన శరీరమును జూచుకొని యేకదా, నేను ఎఱ్ఱగా, లావుగా, ఎత్తుగా, అందముగా, బలముగా, నున్నానని యనుకొనుచున్నాడు? కావున నపుడు 'నేను' అనుపదము శరీర వాచకము - శరీరబోధకము అగుచున్నది. అటులయిన నేను శరీరమా? కాక మఱి యేమగును? అందురేని, నాకాలు, నా హస్తము, నా శిరస్సు, నా ముఖము, నా యుదరము, నా కన్నులు, నా శరీరము అని చెప్పినపుడు శరీరము 'నేను' కాదని తెలియుచున్నదికదా? నేను శరీరముకాదు; శరీరము నాది యనియు బోధపడుచున్నది. నా గృహము, నాధనము, నాభార్య,

నా బిడ్డలు అనునట్టి ప్రయోగాలలో 'నేను' వేఱు, గృహాదులు వేఱు, అని స్పష్టముగ తెలియును. అట్లే శరీరము కూడ 'నేను' కంటె భిన్నము అనుటలో సందేహములేదు. కావున శరీరము నేనుకాదు. మఱి 'నేను' అననేమి? ఈ ప్రశ్నమట్లే యున్నది. నే నన నేమో తెలియకయే జనులెల్లరు పండితులు, పామరులు, నీ పద మును వాడుచున్నారా? నేనన తెలియనివా డెవడు? ఎవడును లేడు, మనుజుడు తెలియని పదమునెట్లు ప్రయోగించును? జీవించి యున్నంతవఱకు ప్రతివ్యక్తియు తనను గూర్చి 'నేను' ఉన్నాననియే యెంచును. ఎంచుటయే కాదు, చెప్పను కూడ, ఎవరు? అను ప్రశ్నకు 'నేను' అని సమాధాన మియ్యని మనుజు డెవడుండును? తన యునికిని గుర్తించియేకదా ప్రతివ్యక్తియు నేనున్నానని అనుచు న్నాడు! అది గుర్తింపనివాడు 'నేనున్నాను' అనియెట్లు చెప్పగలడు? కావున 'నేను (అహమ్) అను పదమే యర్థమును చెప్పనో యది యెల్లరకు తెలిసియే యున్నదని బోధపడుచున్నది. కాని ఆ వస్తువె య్యది? అది యెట్లుండును? దాని స్వరూపమేమి? లక్షణమేమి? అది యింద్రియములకు త్వక్చక్షుశ్శ్రోత్ర జిహ్వాప్రమాణములకు విషయమగునా? ఇంద్రియగోచరమా? కాదా? ఇంద్రియ గోచ రము కానినాడు దానియునికి నంగీకరించుటెట్లు? 'నేను' ఉన్నదా? లేదా? అను నీ ప్రశ్నలకు సమాధానమేమి చెప్పవలసియున్నది?

నేను. ఇదియొక పదము. ప్రతిపదము నొకయర్థమును బోధిం చును. ఏదో యొకవస్తువును, పదార్థమును తెలుపని పదము వ్యర్థమగును. పదమునకు వాచకము అని యింకొకపేరు. వాచక మన చెప్పనది. వాచకముచే తెలియబడు వస్తువు వాచ్యమగును. నేను అను నీపదము నెల్లరు ప్రయోగింతురు. కాని ఇయ్యది దేనికి వాచకము? దీనివలన దెలియబడు వాచ్య మెయ్యది?

పూర్వపంక్తులను జదివిన వారికి 'నేను' అను నీ పదమునకు శరీరము వాచ్యము కాదని స్పష్టమైయుండును. అటులయిన నీ

పదమునకు వాచ్యమెయ్యది? అను ఈ ప్రశ్నమునకు సమాధానము చెప్పవలసియున్నది. నేను అనుపదమువలన దెలియబడు వస్తువెయ్యది? అని ప్రశ్నాభిప్రాయము.

నేను అన 'శరీరము కాదు' అని తెలిసినదికదా! ఇంకను దెలియవలసినదేమి? అని యందురేని, ఇది తెలియుటకాదు. నేను అన శరీరము కాదని చెప్ప సమాధానము నిషేధాత్మకము, అది స్వీకారాత్మకము కాదు. కొండొక వస్తువును గూర్చి ప్రశ్నించునపుడు దానికి సమాధానము 'అదియియ్యది' అని చెప్పవలెను. కాని అది యిది కాదు; అది కాదు; అని చెప్పుట సమాధానము కానేరదు.

ఒకనికి 'గోవు' అననేమో తెలియ దనుకొనుడు. అతడు తెలిసిన వ్యక్తిని 'గోవు అననేమి?' అని ప్రశ్నించె ననుకొనుడు. అతని ప్రశ్నకు గోవు అన గేదె కాదు; సింహము కాదు, అని సమాధానము చెప్పినచో నా వ్యక్తికి గోవన నేమో స్పష్టముగ బోధపడునా? పడదు. ఈ సమాధానము నిషేధాత్మకము (Negative answer). ఇయ్యది స్వీకారాత్మక సమాధానము (Affirmative answer) కాదు. ప్రశ్నకు సమాధానము స్వీకారాత్మకముగనే యుండుట శ్రేష్ఠము. అప్పుడే ప్రశ్నకర్తకు వస్తువు బాగుగా తెలియును. గోవన నేమి? అని యడిగినపుడు ఇదిగో, యిది గోవు అని చెప్పవలెను. ఇట్లే ఘటము అననేమి యని యెవరేని ప్రశ్నించినపుడు ఘటము చెంబు కాదు; కంచము కాదు; గిన్నె కాదు; కుక్క కాదు; నక్క కాదు; ఇది కాదు; అది కాదు; అని యెంత చెప్పినను ప్రశ్నకర్తకు ఘటమననేమో తెలియదు. కావున ఘటమన నిదిగో యిది ఘటము. ఇది నీరు తెచ్చుట కుపయోగించు నొక పాత్ర. అది యిట్లుండును అని స్వీకారాత్మక సమాధానము చెప్పినపుడే ప్రశ్న కర్తకు వస్తుయాథార్థ్యము తెలియును. ఇది కాదు; అది కాదు; అను నిషేధాత్మక సమాధానము వలన వస్తువు బాగుగ తెలియదు.

కావున ప్రస్తుతమున 'నేను' అను పదమున కర్థమేమి? అను

ప్రశ్నకు నే నన శరీరముకాదు - అని నిషేధాత్మక సమాధానము చెప్పినంత మాత్రమున ప్రయోజనము సిద్ధింపదు. ప్రశ్నకర్తకు నే నన నేమో బోధపడదని స్పష్టమగుచున్నది. అందువలన నీ ప్రశ్నకు స్వీకారాత్మక సమాధానము చెప్పవలసియున్నది. ఇప్పుడు నేను అననేమి? అను ప్రశ్నయెంత జటిలమో - కఠినమో పాఠకులకు బోధపడి యుండునని యెంచెద.

కొందఱు ఈ నేను అననేమి? అను ప్రశ్నకు సమాధానముగ జీవుడు-ఆత్మ యనిచెప్పుదురు. ఈ సమాధాన మెంతో సులభముగ దోచును. కాని, జీవుడు లేక ఆత్మ యని చెప్పినంతమాత్రమున ప్రశ్నకర్త కేమి తెలియును? క్రొత్త పదములు రెండు అతనికి దెలియవచ్చును. కాని, ప్రశ్నకర్తకు నేనను వస్తువేమో తెలియునా?

ఘటమన నేమో తెలియని యొక వ్యక్తికి ఘటమునకు సమానార్థకములగు కలశము, కుంభము, కంబుగ్రీవాదిమత్ పదార్థము అని క్రొత్త పదములు చెప్పినంత మాత్రమున ఘటమననేమో తెలియునా? ఘటమునకు సమానార్థకములయిన మఱిరెండు మూడు క్రొత్త పదములు తెలియునేకాని వాస్తవమున ఘటమను వస్తువెయ్యదియో యతనికి బోధపడదు, అట్లే నేను అను పదమునకు జీవుడు, ఆత్మ అని రెండు క్రొత్త పదములు అర్థముగ జెప్పినందు వలన ప్రశ్నకర్తకు గలుగు ప్రయోజనమేమి? జీవుడు, ఆత్మ అను నీ రెండు పదములును 'నేను' అను పదమునకు సమానార్థక పదములేకాని అర్థము కాదు. అర్థము వస్తురూపమున బోధపడవలయును. వస్తువు తెలియనంతవఱకు ప్రశ్నకర్తకు గలుగు ప్రయోజన మొండును లేదు. అతనికిగల యజ్ఞాన మట్లేయుండును. అది దూరముకాదు. కావున నేనన నేమి? అప్రశ్నకు సమాధానము స్వీకారాత్మకముగ - నిస్సందిగ్ధముగ తెలిసికొనుటకు ముందు - లోకమునగల వస్తువులను దెలిసికొనుటకు సాధనములు - ఉపాయములు ఏమో యెఱుగుట యావశ్యకమగుచున్నది.. అందువలన వాస్తవమున మనుజులకు వస్తుయాథార్థ్యము తెలియువిధము నెఱు

గవలయును. పదార్థవిజ్ఞానము గలవారు - తత్త్వవిదులు వస్తువులు లక్షణప్రమాణముల మూలమున నెఱుగబడునని చెప్పుదురు. లక్షణ ప్రమాణములు వస్తువిజ్ఞానమునకు సాధనములని వీనింబట్టి తెలియు చున్నది. సాధనజ్ఞానము లేనివారికి సాధ్యజ్ఞానము కలుగ నేరదు. కాబట్టి నేనన నేమో తెలిసికొనుటకు ముందు పాఠకులకు లక్షణ ప్రమాణములు తెలియవలసియుండును. ప్రస్తుతలేఖయందు లక్షణ ప్రమాణములను గూర్చివ్రాయుట యప్రస్తుతమేయైనను నొకింతవా నిని వివరింపక తప్పదు. లక్షణప్రమాణములు తెలియని పాఠకులకు నేనను పదము తెలుపు వస్తు వెయ్యదియో తెలియుట కష్టతర మగును. లక్షణ ప్రమాణముల నెఱిగిన పిమ్మట వానిమూలమున నేనన నేమో వివరింప యత్నింతును. వైజ్ఞానిక పద్ధతి ననుసరించి వస్తుయాథార్థ్యము నెఱుగుటకు ఇంతకంటె వేఱొక యుపాయమే లేదు.

లక్షణ ప్రమాణములలో ముందు లక్షణమును వివరింతును. పాఠకులీ లక్షణ ప్రమాణముల నొక్కమాటు బాగుగ నవగతము చేసికొనిన పక్షమున వారికి వస్తుయాథార్థ్యము బాగుగ బోధపడగ లదు.

లక్షణము:- లక్షణము, స్వరూపము, రూపము అను నీపదము లన్నియు సమానార్థకములు. దర్శనము - తత్త్వబోధకశాస్త్రములలో నీ పదము ఎక్కుడుగ వాడబడును. దీనికి సరియైన తెలుగుపదములు లభించుట కష్టము.

మనమేదేని యొకవస్తువును లక్షణ పూర్వకముగ తెలిసికొనగోరు దుమేని యావస్తువు శాస్త్రీయభాషలో 'లక్ష్యము' అనబడును. ఆ లక్ష్యమును దెలుపునది లక్షణము. లక్షణమును అసాధారణ ధర్మ మనియు నందురు. ప్రతివస్తువునందును కొన్ని ధర్మము లుండును. ధర్మములు లేని వస్తువుండదు. ధర్మములు కలిగియుండును కావున వస్తువు ధర్మియనియు ననబడును. లక్షణములను గుణములనియు చెప్పవచ్చును. ప్రతివస్తువు నందును నేవో కొన్ని గుణములుం

డును. గుణములుండుటచే నది గుణియనియు చెప్పబడును.

వస్తువునందుండు ధర్మములలో కొన్ని సాధారణములు, మఱి కొన్ని అసాధారణములు అని రెండురకములైన ధర్మములుండును. అనేకవస్తువులలో నుండు నొకేవిధమగు ధర్మము సాధారణ ధర్మ మనబడును. అనేకములలో నుండక నొకేదానియందుండు ధర్మము అసాధారణ ధర్మమనబడును. తెలుపురంగుగుల వస్తువు లనేకము లున్న వనుకొనుడు. వానిలో నుండు నీతెలుపురంగు ఆ వస్తువుల సాధారణ ధర్మమగును.

ఉష్ణత అగ్నిలోనే యుండును. ఇతర వస్తువులయిన జలాదు లలో నుండదు. ఇట్లే శీతలత నీటిలోనే యుండును. ఇతరమున నుండదు. కావున ఉష్ణత, శీతలత అనెడి ధర్మములు అగ్ని జల ములకు క్రమమున అసాధారణ ధర్మము లనబడును.

ఆ యావస్తువులలో నుండు నిట్టి యసాధారణ ధర్మములే లక్ష ణములనబడును. అవియే యా వస్తువులకు స్వరూపములనియు, రూపములనియు చెప్పబడును. ఈ యసాధారణధర్మమే - లక్ష ణమే వస్తువును బోధించును. మన మే వస్తువును దెలిసికొనగోరు చున్నామో యా వస్తువు నితర వస్తువులనుండి వేఱుచేసి బోధించు నదియే లక్షణ మగును.

ఉదాహరణము మూలమున నీ విషయము పాఠకుల కింకను బాగుగ స్పష్టము కాగలదు. ఒక వ్యక్తికి గోవు అననేమో తెలియ దనుకొనుడు. అతడు గోవు నెఱుగదలచి, యెఱిగిన వ్యక్తిని 'గోవు' అన నెట్టి జంతువు? అని ప్రశ్నించును. అతనికి గోవును దెలుపవ లసి యున్నది. కావున గోవు లక్ష్యమనబడును.

లక్ష్యమును దెలుపునది లక్షణమగునని యింతకుపూర్వమే చెప్పి యున్నాము-గోవునకు లక్షణమేమి? లక్షణమన నసాధారణ ధర్మమే కావున గోవులో నుండు నసాధారణధర్మము తెలిసిన దానిమూలమున

గోవు బాగుగ తెలియనగును.

జంతువులలో ననేకజంతువులకు నాలుగు కాళ్ళుండును. నాల్గు కాళ్ళు కలిగియుండుట యనేకజంతువులలో నుండు నొకధర్మము. కాని, యీధర్మము సాధారణ ధర్మము; అసాధారణ ధర్మము కాదు. అట్లే యనేక జంతువులకు రెండు కొమ్ములు కలిగియుం డుటయు సాధారణ ధర్మమే. ఇట్లే తెలుపు, నలుపు, రంగులు కలిగియుండు జంతువు గోవు అని చెప్పిన నా ధర్మములు గోవు నకు లక్షణములు కావు. ఇవియన్నియు గోవులలోను, గోవులుకాని జంతువులలోను నుండు ధర్మములు, కావున సాధారణ ధర్మములు, అసాధారణ ధర్మములు కావు. అందువలన గోవన నేమో తెలియదు. గోవులకు మెడక్రింద తోలు వ్రేలాడుచుండును. అది తెలుగున 'గంగడో' లనియు, సంస్కృతమున 'సాస్న' యనియు ననబడును. గంగడోలు కలిగియుండుట గోవునకు అసాధారణ ధర్మము - విశేష ధర్మము. ఇదియే దానికి లక్షణము, గోవు నెఱుగనివానికి 'ఏ జంతువు మెడక్రింద దుప్పటివలె తోలు వ్రేలాడుచుండునో యది గోవు' అని తెలిపిన నతడు ఆ జంతువును స్పష్టముగ తెలిసికొనగలడు. కావున గోవునకు సాస్నాదిమత్వము - గంగడోలు, నాలుగుకాళ్ళు మున్నగునవి కలిగియుండుట లక్షణమగుచున్నది. ఈ లక్షణమును బట్టి లక్ష్యమగు గోవు బాగుగ తెలియబడును. ఆ జంతువునకు చెందిన జ్ఞాన మతనికి గలుగును. లక్షణమననేమో, దాని మూలమున లక్ష్యము - వస్తు వెట్లు తెలియబడునో పాఠ కుల కొకింత విదితమై యుండునని యెంచెద. ఇక ప్రమాణమును గూర్చియు కొంత వివరింప యత్నింతును.

ప్రమాణము:- ప్రమ - జ్ఞానము. ప్రమాణము - జ్ఞానసాధనము, ప్రమాణములు నాలుగు. 1. ప్రత్యక్షము 2. అనుమానము 3. ఉపమానము 4. శబ్దము. ఈ నాలుగు ప్రమాణములవలనను నాల్గు విధములైన జ్ఞానము కలుగును. ప్రత్యక్షము, అనుమితి, ఉపమితి, శాబ్దము అని యీ జ్ఞానమునకు పేర్లు.

1. ప్రత్యక్షప్రమాణము :- అక్షమన ఇంద్రియము. ప్రతి + అక్షము = ప్రత్యక్షము - ప్రతి ఇంద్రియము. కన్ను, ముక్కు, చెవి, జిహ్వ. త్వక్కు అను నీ యైదింద్రియములవలనను మనుజులకు జ్ఞానము కలుగును. లోకమునగల వస్తువుల జ్ఞాన మీ యింద్రియములవలననే కలుగునన్నట యెల్ల రెఱిగినదియే, కావున నింద్రియములైదు ప్రత్యక్ష ప్రమాణమనబడును. వీనివలన కలుగు జ్ఞానము ప్రత్యక్షజ్ఞాన మగును. ఇట్లు వస్తుజ్ఞానమునకు సాధనములగుటవలననే నేత్రాదీంద్రియములకు జ్ఞానేంద్రియములనియు నామము. ఈ యింద్రియముల మూలమున రూప, రస, గంధ, స్పర్శ, శబ్దములు గల వస్తువుల జ్ఞానము కలుగును.

2. అనుమానము:- (అను పశ్చాత్ మీయతే జ్ఞాయతే ఇత్యనుమానమ్) ప్రత్యక్ష ప్రమాణముచే దెలియబడు వస్తుజ్ఞానముమూలమున నూహించి ప్రత్యక్షము కాని వస్తువును దెలిసికొన ననువగు ప్రమాణము అనుమాన మనబడును. పొగనుచూచి నిప్పును ఊహింతుము. ఈ నిప్పుకు సంబంధించిన జ్ఞానము అనుమానికము - అనుమితి యనబడును. ఇట్లే గుణములను ప్రత్యక్షముగా నెఱింగి గుణిని ఊహించి తెలిసికొనుటయు, కారణమునుజూచి కార్యము నూహించుటయు అనుమితియే యనబడును, ఇట్లనుమాన ప్రమాణ మనేకవిధములనియు పాఠకులు గుర్తింపవలెను.

3. ఉపమానము:- సాదృశ్య జ్ఞానమువలన వస్తువును తెలిసికొనుట ఉపమితి యనబడును. కావున సాదృశ్యజ్ఞానము ఉపమాన ప్రమాణమగును. అడవిలో నుండు గోవు గవయు మనబడును. అది నాగరిక గోవువలెనో ఉండును. నాగరిక గోవులోనుండు లక్షణము అడవిలో నుండు గోవులో కనిపించినపుడు దానిని గవయమని గుర్తింతుము; ఇదియే యుపమితి జ్ఞానము.

4. శబ్దము:- ఆప్తులు చెప్పు వాక్యము శబ్దప్రమాణ మనబడును. ఆప్తులు యథార్థము చెప్పువారు. అట్టివారు చెప్పువాక్యములవలనను జ్ఞానము కలుగును. అట్టి జ్ఞానము శాబ్దజ్ఞాన మనబడును.

వేదము ఈశ్వరీయమగుటవలనను, ఈశ్వరుడు పరమాప్తుడగుటవలనను వేదవాక్యములు శబ్దప్రమాణముగ నంగీకరింతురు.

ఇట్లీ నాలుగువిధములగు ప్రమాణములు, వానివలన జ్ఞానము కల్గు విధానము పాఠకులు గుర్తింపవలెను. ప్రమాణములను గూర్చి మిక్కిలి సంక్షేపముగ నిట వివరింపబడినది. వివరములు ఎక్కువగా తెలిసికొనదలచినవారు నాచే రచయింపబడిన న్యాయదర్శనమును జూడగోరెద.

ప్రమాణములు తెలియనివారికి బ్రహ్మాండమునగల వస్తువులను దెలిసికొను విధము తెలియదు. వారు తమ యింద్రియములకు తెలియని వస్తువులను సరిగ గుర్తింపజాలరు. బ్రహ్మాండమునగల పదార్థములన్నియు నింద్రియములవలననే తెలియవు. ఇంద్రియములకందని విషయము లెన్నియో యున్నవి. ప్రత్యక్ష ప్రపంచ మతి స్వల్పము. అనుమానాది ఇతర ప్రమాణములవలన దెలియదగువస్తువులెన్నియో యున్నవి. అందువలన నీ వ్యాసమునందు ప్రమాణములను గూర్చి యొకింత వ్రాయబడినది.

ఇట్లు లక్షణప్రమాణములు తెలిసిన తదుపరి దీని సహాయమున 'నేను' అననేమో తెలిసికొనువిధము ముందు వివరింపబడును.

'నేను' అను పదముచే దెలియబడు వస్తువు ప్రత్యక్షప్రమాణమునకు విషయముగాదు - ఇంద్రియములకు దెలియు వస్తువుగాదు. శరీరమింద్రియగోచరమే. కాని, 'నేను' ఇంద్రియగోచరము కాదు. ఇంద్రియములకు దెలియు వస్తువు లెట్టివో తెలిసినచో 'నేను' ఇంద్రియములకేల తెలియదో స్పష్టము కాగలదు.

తెలుపు, నలుపు, ఎఱుపు మున్నగు రంగులు గల వస్తువులే నేత్రములకు గోచరములగును. నాసికకు గంధముగల వస్తువులు తెలియును. జిహ్వకు రుచులుగల వస్తువులు బోధపడును. చెవులకు శబ్దములు, శబ్దములుగల వస్తువులు గ్రాహ్యము లగును. త్వగింద్రియమునకు స్పర్శ. స్పర్శగల వస్తువులు గోచరించును. శబ్దస్పర్శరూప

రసగంధములలో నే గుణమున్న వస్తువైనను ఇంద్రియముచే తెలియన గును. 'నేను' అనబడు వస్తువులో పైన వర్ణించిన యైదుగుణములలో నొక్కగుణము కూడ లేదు. అందువలన 'నేను' ఇంద్రియగోచరము కాదు - ప్రత్యక్ష ప్రమాణముచే దెలియబడదని యభిప్రాయము: కావున 'నేను' లో నున్న గుణముల మూలమున దాని నెఱుగవచ్చును.

'నేను' అను నొకవస్తువు శరీరమునందే. యున్నట్లు మనకు నిత్య వ్యవహారమువలన దెలియుచునే యున్నది. నేను ఉన్నాను; నేను వచ్చుచున్నాను; నేను చూచుచున్నాను. అను నీప్రయోగము లన్నియు శరీరధారియే ప్రయోగించును. ఒకసమయమున శరీరము అట్లే యున్నను నీ ప్రయోగము లుండవు. మరణానంతరమున శరీ రము కొంతతడవు పూర్వ మున్నట్లే యుండును. కాని, యప్పుడా శరీరము 'నేను' ఉన్నాను; వచ్చుచున్నాను; అను నిట్టి ప్రయోగము లను ప్రయోగింపదు. అప్పుడా శరీరమున 'నేను' అనునది లేదనియు, అది యెక్కడికో పోయినదనియు మనమూహింతుము. దీనింబట్టి మనకు గనబడు శరీరమునందొకప్పుడు 'నేను' ఉండుననియు, ఒకప్పు డది యందుండక యెటకో పోవుననియు దెలియుచున్నది. ఇంతేకాక 'నేను' శరీరమునందున్నప్పుడు ఆ శరీరమున జ్ఞానము, ఇచ్ఛ-కోరిక, ప్రయత్నము, ద్వేషము, సుఖము, దుఃఖము నన్నియు నుండును. 'నేను' శరీరమును విడిచిపోయినపుడు జ్ఞానాదు లందుండవు. నేను శరీరమున నున్నప్పుడు ఆ నేను తన కిది తెలియును, అది తెలి యును, అనును, అనుటయే కాదు. వస్తువుల నది తెలిసికొనును: ఇదిగో ఇది పుస్తకము; ఇదిగో యిది యిల్లు; అని యిట్లు వస్తువుల నెఱుగును. అంతేకాక, తనకు ఆవస్తువులు కావలెనని కోరును. ఆ వస్తువులలో కొన్ని తనకు పనికిరానివిగ నెంచును. వానిలో నేదేని వస్తువు తనకు దుఃఖము కలిగించున దగునెడల దానిని ద్వేషించును. కావలె ననుకొనిన వస్తువులను సంపాదించుటకును: ద్వేషించు వస్తువు లను దూరముగ నుంచుటకును ఈ 'నేను' ప్రయత్నము చేయును.

సంపాదించుకొనిన వస్తువులను వాడుకొని ఉపయోగించుకొనినపుడు తన కనుకూలముగనుండని పక్షమున బాధపడును; దుఃఖించును. ఇట్లు జ్ఞానము, కోరిక, ద్వేషము, ప్రయత్నము, సుఖము, దుఃఖము నను నీ యాఱు గుణములు 'నేను' శరీరమునందున్నంతవఱకు నుండును. నేను శరీరము నుండి పోయినపుడు మిగిలిన కేవల శరీరమున శవమున పైగుణములు కూడ కనిపింపవు. ఇది ఎల్లరకు తెలిసిన విషయమే కదా! దీనింబట్టి యేమి తెలియుచున్నది? నేను అను వస్తువునకును, జ్ఞానాదులగు నాఱుగుణములకును సంబంధము న్నట్లు స్పష్టముగ తెలియుచున్నది. అందువలననే, 'నేను' శరీర మున నున్నపు డవి యుండును. నేను శరీరమున లేనపు డవియు నుండవు. ఏది యున్న నేగుణములుండునో, ఏదిలేకున్న నేగుణము లుండవో, అది యాగుణములు కలిగిన వస్తువని నిస్సంశయముగ తెలిసికొనవలెను. అగ్ని యున్నపుడు ఉష్ణముండును. అగ్ని లేనపుడు ఉష్ణముండదు. కాబట్టి అగ్ని యుష్ణగుణము కలది యనుట లోకవి దితము. కావున జ్ఞానము, కోరిక ద్వేషము, ప్రయత్నము సుఖము, దుఃఖముసను నీ యాఱు గుణములు కల్గినది 'నేను' అని మన కిప్పుడు స్పష్టముగ తెలిసినది. 'నేను' జ్ఞానాది గుణములుగల యొక వస్తువు - అని పైపంక్తులవలన పాఠకులు బాగుగ గుర్తింపగలరని యెంచెద. అందువలన నేననునేమి? అను ప్రశ్నకు సత్తాత్మక సమాధాన మేమగుచున్నది? జ్ఞానాది గుణములు గల వస్తువు అని సమాధానము. నేను జ్ఞానాది గుణములుగల యొకవస్తువై నపు డది యేల ప్రత్యక్షముకాదు? అని ప్రశ్న కలుగును. కాని జ్ఞానాది గుణములు ఇంద్రియములకు తెలియు గుణములు కావు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను నైదు గుణములే ఇంద్రియ ములకు దెలియును. కావున, 'నేను' ఇంద్రియగోచరము కాదు - ప్రత్యక్షముకాదు - అని భావము. 'నేను' జీవుడు, జీవాత్మ అను నీపదములన్నియు సమానార్థకములని యిదివరకే పాఠకులు తెలిసికొ నియున్నారు. కావున జీవుడు జ్ఞానాదిగుణములు గల యొకవస్తువని

యిప్పుడు పాఠకులు బాగుగ గుర్తింపవచ్చును. ఈ జ్ఞానాదిగుణములే జీవునకు లక్షణము. ఈ లక్షణమును బట్టియే నేను-జీవుడు-అననేమో తెలియనగుచున్నది. అనగా గుణములమూలమున గుణి తెలియబడినదని భావము. గుణములను బట్టి గుణిని తెలిసికొనుట అనుమాన ప్రమాణమునకు విషయమగును. ఈ విధముగ లక్షణ ప్రమాణములతో 'నేను' అననేమో పాఠకులు గ్రహించి యుందురని యెంచెద. ఇకముందు శాస్త్రప్రమాణములతో నీ విషయము కొంత వివరింప యత్నింతును.

భారతీయ దార్శనికుల - వేదాంతుల - తాత్త్వికులలో కణాద మహర్షి యొకరు. ఇతడు క్రీస్తుకు చాల పూర్వుడు. గ్రీకు వేదాంతు లయిన ప్లేటో, సోక్రటీసు మున్నగువారికంటెను పూర్వుడే. ఇతడు పరమాణువాది. ఈ జడ ప్రపంచమునకు మూలతత్త్వములు పరమాణువులని ప్రప్రథమమున చెప్పినవాడు. ఇతడు తన వాదమును క్రమబద్ధముచేసి యొక శాస్త్రమును రచియించి యున్నాడు. అదియే వైశేషిక దర్శనము.

కణాదుడు తన శాస్త్రమునందు ముందుగ ప్రపంచమూలతత్త్వములన్నింటిని నాఱు భాగములుగ విభజించి వానికి పదార్థములని నామకరణ మొనర్చియున్నాడు. 1. ద్రవ్యములు 2. గుణములు 3. కర్మలు 4. సామాన్యము 5. విశేషము 6. సమవాయము. ఈ పదార్థము లన్నింటిని మరల విభజించి క్రమముగ వానిని వివరించి యున్నాడు. వానిలో ప్రథమ విభాగమగు ద్రవ్య పదార్థమును తొమ్మిది విధములుగ విభజించియున్నాడు.

"పృథి వ్యాపస్తేజో వాయు రాకాశం కాలో ది గాత్మా మన ఇతి ద్రవ్యాణి" వై.సూ.

1. భూమి 2. జలము 3. అగ్ని 4. వాయువు 5. ఆకాశము 6. కాలము, 7. దిక్కు 8. ఆత్మ 9. మనస్సు అను నీ తొమ్మిదియు ద్రవ్యము లనబడును.

పాఠకు లింతవఱకు తెలుగున 'నేను' అని యే వస్తువును గూర్చి తెలిసికొనియున్నారో యా వస్తువునే కణాదుడు తనశాస్త్ర మున 'ఆత్మ' యని చెప్పి ద్రవ్యములలో చేర్చి కీర్తించియున్నాడు. ఇక ముందు ఆత్మ యని వచ్చినచోట పాఠకులు దానిని 'నేను' అనియే తెలిసికొనగోరుచున్నాడ.

కణాదమహర్షి 'ఆత్మ'ను ద్రవ్యమని తన శాస్త్రమున చెప్పి యున్నాడు. ఇట ద్రవ్యమననేమో తెలిసికొనవలసియున్నది. అప్పుడే దాని స్వరూపము పాఠకులకు బాగుగ బోధపడగలదు.

కణాదుడు స్వయముగ ద్రవ్యమన నెమో యిట్లు స్పష్టము చేసియున్నాడు.

"క్రియాగుణవత్ సమవాయి కారణమితి ద్రవ్యలక్షణమ్" వై.11-15

దేనియందు క్రియ, గుణములు ఉండునో అది ద్రవ్యమనబడును. లేక దేనియందు అవినాభావ సంబంధముతో కార్య ముత్పన్నమగునో యదియు ద్రవ్యమనబడును. దానిని సమవాయి కారణ మనియు నందురు. (అవినాభావ సంబంధమనగా విడదీయుటకు వీలులేని సంబంధము), సమవాయి కారణమునుండి కార్యమును విడదీయు టకు - వేఱుచేయుటకు వీలుండదు. ఉదాహరణము: వస్త్రమునకు దారములు సమవాయి కారణము, ఆ సమవాయి కారణమనబడు దారములలోనే వస్త్రమను కార్యముత్పన్నమగును. దారములనుండి వస్త్రమును వేఱుచేయ వీలుండదుకదా! కావున దారములకు వస్త్ర మునకు గల సంబంధము అవినాభావ సంబంధమనబడును. ఇట్టి సంబంధముతో దేనియందొక వస్తువుత్పన్నమగునో యది ద్రవ్య మన బడునని భావము. సమవాయి కారణమనునది యెల్లప్పుడు ద్రవ్యమే యగును. కాని ద్రవ్యమనబడు ప్రతివస్తునందును కార్యముత్పన్నము కావలెనను నియమము లేదని పాఠకులు గుర్తించుకొనవలెను.

ఇట్లు భారతీయ తత్త్వజ్ఞుల దృష్టిననుసరించి 'ఆత్మ' భూమ్యా దులవలె నొక ద్రవ్యమనియు, అయ్యది క్రియాగుణముల కాశ్రయమ

నియు నిర్ణయింబడినది. ఆంగ్లేయభాషలో వైజ్ఞానికులు ద్రవ్యమును 'సబ్ స్టెన్స్' (Substance) అందురు. ఇంకను పరిష్కృత భాషలో చెప్పిన 'సబ్ స్ట్రేటమ్' (Substratum, Noumenon) గుణాశ్రయము అనియు చెప్పవచ్చును. కావున ఆత్మ యనునది భారతీయతత్త్వజ్ఞుల యభిప్రాయమున స్వతంత్ర సత్తాగలిగి, క్రియాగుణముల కాశ్రయమైన యొకవస్తువనియు, అయ్యది ప్రపంచ మూలతత్త్వము లలో నొకటనియు నిర్ణయింపబడినట్లు పాఠకులు గుర్తుంచుకొనవలెను.

ఓమ్ తత్ సత్

ఓమ్

ఈశ్వర స్వరూపము

వైదికులు ఈ ప్రపంచమునకు మూలభూతతత్త్వములు మూడందురు. 1. ఈశ్వరుడు 2. జీవులు 3. ప్రకృతి. ఇందు జీవేశ్వరులు చేతన పదార్థములు. ప్రకృతి జడతత్త్వము. ఈశ్వరతత్త్వము వ్యాపకము. జీవులు సూక్ష్మతత్త్వము. ప్రకృతి పరిణమించు సూక్ష్మతత్త్వము. ఈశ్వరుడు సృష్టికి కర్త, చేతననిమిత్త కారణము. ప్రకృతి ప్రపంచమునకు ఉపాదాన కారణము. జీవులు ప్రాకృతిక పదార్థముల సంబంధము కలవారై సుఖదుఃఖముల నందుచుందురు.

ఈ మూలతత్త్వములను మూడింటిని వేద మిట్లు ప్రతిపాదించుచున్నది. చూడుడు:

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే,
తయో రన్యః పిప్పలం స్వా ద్వత్తి అనశ్నన్ అన్యోఽభిచాకశీతి." ఋక్కు.

"రెండు సుపర్ణములు (పక్షులు) సమాన (ఒక) వృక్షమును పరిష్వంగ మొనర్చియున్నవి. అందొకటి (జీవుడు) వృక్షఫలముల రుచిననుభవించుచున్నది. రెండవది (ఈశ్వరుడు) అనుభవింపక యంతట ప్రకాశించుచున్నది".

ఇందు సుపర్ణములు చైతన్యముకలిగియుండును. కావుననవి జీవేశ్వర సూచకములు. వృక్షమన వ్రయ్యలు చేయదగినది యని భావము. కావున పరిణమించు స్వభావము గలిగిన జడతత్త్వమగు ప్రకృతికి సూచకము.

ఉపనిషత్తులలోను ఈ మూలతత్త్వము లిట్లే ప్రదర్శింప బడినవి.

"అజా మేకాం లోహితశుక్ల కృష్ణాం
బహ్వీః ప్రజాః సృజమానాం స్వరూపాః
అజో హ్యేకో జుషమాణో నుశేతే
జహాత్యేనాం భుక్తభోగామజోఽన్యః" శ్వేతాశ్వతర 4-5

"న జాయతే ఇత్యజా, జన్మరహితమైన అజ (మేకప్రకృతి) యొకటి లోహితశుక్ల కృష్ణవర్ణములు కలిగియున్నది. తన స్వరూపముగల అనేక సంతానమును నిర్మింప ననువగు స్వభావము గలదియది. ఆయజను అజు డొకడు (జన్మరహితుడు - దేవుడు) వ్యాపించి అంతటను శయనించియుండును. మఱియొక అజుడు (జన్మరహితుడు - జీవుడు) నిః శేషముగ భోగించి విడిచిపెట్టును".

ఈః మూడు మూలతత్త్వములనే శ్రీమద్ భగవద్గీతయందు వ్యాసుడును స్పష్టశబ్దములతో ప్రదర్శించి యున్నాడు.

"ద్వా విమౌ ఉరుషౌ లోకే క్షర శ్చాక్షర ఏవ చ,
క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే,
ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః"

(భ.గీ.15-16-17)

'దృశ్యమాన ప్రపంచమునందు క్షరాక్షరనామములతో పేర్కొనదగు నిద్దఱు పురుషులు - రెండు పదార్థములు ఉన్నవి. అందు క్షరపదార్థములు జడభూతములు, కూటపదవాచ్యమగు నీ ప్రపంచముననుండు జీవుడు అక్షరు డనబడును. జడపదార్థములు నాశవంతములు - పరిణతిని బొందునవి యనిభావము. జీవు లట్లు పరిణామమును బొందరు. ఎల్లప్పుడు నొక్కటిగనే యుండి నిత్యులగుదురు.

ఇక నుత్తమపురుషుడు పైన జూపిన రెండువస్తువులకు భిన్నుడు. అతనిని పరమాత్మ శబ్దముతో జెప్పుదురు. ఆత్మ యనుటచే నయ్యది వ్యాపకపదార్థమనియు బోధపడుచున్నది. అన్యపదముచే నందలి విలక్షణత్వమును ప్రకటింపబడినది'.

ఇట్లు వైదికసంప్రదాయవిదు లెల్లరు ప్రపంచమునకు మూలత త్త్వములు మూడని యంగీకరించుటకు సందేహింపరు.

అం దీశ్వరతత్త్వమును గూర్చి దాని స్వరూప స్వభావము లేమో యొకింత విచారింతము.

"స పర్యగా చ్ఛుక్ర మకాయ మవ్రణ మస్నావిరగ్ం శుద్ధ మపాపవిద్ధం
కవి ర్మనీషీ పరిభూః స్వయంభూర్ యాథాతథ్యతోఽర్థాన్ వ్యదధాత్
శాశ్వతీభ్యః సమాభ్యః" (యజు 40-8)

సః పరి + అగాత్:- ఆపరమేశ్వరు డంతటను వ్యాపించి యున్నాడు. ఈశ్వరుడు సృష్టికర్త. కావున నతడు స్వతంత్రుడు. "స్వతంత్రః కర్తా" అని పాణిని నుడివియున్నాడు. ఈ దృశ్యమాన ప్రపంచమే సృష్టి యనబడును. సృష్టియన కార్యపదార్థము. కార ణరూపమునుండి కార్యరూపమునకు తేబడిన వస్తువని యర్థము. సూక్ష్మరూపమునుండి స్థూలరూపమును ధరింపజేయబడిన వస్తువని భావము. ఏ వస్తువును అనేకశకలములు-ఖండములు-ముక్కలుగా జేయనగునో అది కార్యవస్తువని దార్శనికులు నుడువుదురు. ప్రపంచ మున గల చిన్న పెద్ద వస్తువులు అన్నియు తునుకలు తునుకలుగా జేయదగినవే యనుటలో నేరికిని సందియ ముండదు. కాబట్టి ప్రపంచమంతయు కార్యజాతమని సిద్ధమగుచున్నది.

కార్యము కర్తలేక సంభవింపదు. కార్యత్వమునకు కర్తృత్వమునకు వ్యాప్యవ్యాపక సంబంధ ముండును. ధూమాగ్నులవలె కార్యత్వ కర్తృత్వములు వ్యాప్యవ్యాపకములు. ధూమాగ్నులలో ధూమము వ్యాప్యము, అగ్ని వ్యాపకము. వ్యాప్యవ్యాపకములలో వ్యాప్యము తక్కువ ప్రదేశమున నుండును. వ్యాపకము ఎక్కువ ప్రదేశమున నుండును. కాని అగ్ని యున్నచోట తప్పక ధూమ ముండవలయు నను నియమము లేదు. విద్యుదగ్నికి ధూమసంబంధముండదు. కాబట్టి అగ్ని వ్యాపకము, ధూమము వ్యాప్యము. అట్లే కార్యత్వము వ్యాప్యము. కర్తృత్వము వ్యాపకము. ప్రపంచమున నెల్లయెడల

కార్యత్వము గోచరమగుచునే యున్నది. అట్టి కార్యత్వ మున్నచోట కర్తృత్వ ముండక తప్పదు. కాబట్టి సృష్టికర్తయగు పరమేశ్వరుడు సృష్టిలో నెల్లయెడల - విశ్వమునందంతటను ఉండును. వ్యాపకు డగు టంబట్టి విశ్వమందంతటనే కాక విశ్వమునకు వెలుపలను ఉండును. అనగా విశ్వము లేనియెడలను కూడ భగవంతుడుండునని భావము. అందువలననే వేదమంత్రమున భగవంతుడు 'పరి-అగాత్' అంతట నున్నాడని చెప్పబడినది.

ఈ విషయమునే - భగవంతుని వ్యాపకత్వమునే బోధించుటకు మఱియొకయెడ మంత్ర వర్ణనములందు -

"పాదోఽస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతం దివి"

"సమస్త బ్రహ్మాండ మీ భగవంతుని, యొకపాదమున అంశ మున నిమిడియున్నదనియు, మిగిలిన పాదత్రయము అమృతమై, దివ్యమైయున్నదనియు" స్పష్టముగా వర్ణింపబడినది.

అందువలన పరమేశ్వరుడు వ్యాపకుడు, ప్రపంచము వ్యాప్యము. పరమేశ్వరుడు బ్రహ్మాండమున లోపల వెలుపల అను భేదము లేక అంతట నిండియున్నాడు. కావుననే యతడు "స బాహ్యాభ్యంతరో హ్యజః" అని యన్యత్ర వర్ణింపబడియున్నాడు.

పరమేశ్వరు డింకను నెట్టివాడన మంత్రము నుడువుచున్నది.

శుక్రమ్:- అని. అతడు శుక్రుడు. అనగా బ్రహ్మాండమును సృష్టించి, పోషించి, లయము చేయు శక్తిగలవాడు. సూక్ష్మముగా నున్న దానిని స్థూలమున బరిణమింపజేయుట సృష్టియనబడును. కారణరూపమున నున్న పదార్థమును కార్యరూపమునకు దెచ్చుటయే సృష్టి యనబడును. పరమేశ్వరుడు మిక్కిలి సూక్ష్మరూపమున నున్న ప్రకృతిని స్థూలము చేసి వికృతిగా మార్చును. ఇంద్రియములకు గోచరము కాని ప్రకృతిని పరమాణురూపమున నున్న జడతత్త్వమును పరమేశ్వరుడు మహత్తత్త్వాది భేదములతో పృథివ్యాది పంచమ

హాభూతముల రూపమున బరిణమింప జేయును. ఇదియే సృష్టి. ఇట్టి సృష్టిని నియమబద్ధముగ నడుపుటయే స్థితి. ఒకప్పుడు మరల నీ ప్రపంచమును సూక్ష్మమగు ప్రకృతి - పరమాణు రూపమున మార్చును. దీనిని లయమందురు. ఇట్టి సృష్టి స్థితి లయములు చేయగల శక్తికి శుక్రమ్ - సామర్థ్యము అని పేరు.

ఇంకను నా పరమేశ్వరు డెట్టివాడు?

అకాయం, అవ్రణం, అస్నావిరగ్ం :- స్థూల సూక్ష్మ కారణ దేహములు లేనివాడు. పరమేశ్వరుడు దేహధారి కాడు. ఈ మంత్ర మున గల అకాయపదము స్థూలదేహమును, అవ్రణము, అస్నావిరము ననుపదములు సూక్ష్మకారణ శరీరములును లేనివాడని తెలుపుటకు ప్రయోగింప బడినవి. పరమేశ్వరునకు దేహము కలుగుటకు వీలులేదు. అయ్యది జీవులకు కలుగును. జీవులు తామొనరించు కర్మఫలముల ననుభవించుటకు దేహము లనుబంధనమున బడుదురు. అట్టి బంధ నము దేవున కుండదు. ఇంతకు పూర్వము దేవుడు వ్యాపకుడనికదా మంత్రము నుడివియున్నది. వ్యాపకతత్త్వము దేహముచే నెట్లు బంధింపబడును? హస్తపాదాద్యవయవములు గల పరిమిత వస్తువుచే బంధింపబడుచో దేవుడు వ్యాపకుడు కాజాలడుగదా! కావున నతని కెట్టి శరీరబంధనము లేదనిభావము. కావుననే మంత్రము, తరువాత పరమేశ్వరుని 'శుద్ధం అపాపవిద్ధం' అనుచున్నది.

శుద్ధం:- పరమేశ్వరుడు శుద్ధుడు - నిర్మలుడు. అపాపవిద్ధం - పాపము లతని కంటవు. అతడు జీవు డొనర్చునట్లు శుభాశుభక ర్మలు చేయువాడుకాడు. దేహధారులే శుభాశుభకర్మము లొనర్తురు. శుభకర్మములవలన శుభసంస్కారములు, అశుభకర్మములవలన అశుభ-పాప సంస్కారములు జీవుల యంతఃకరణములం దేర్పడి యా కర్మఫలముల ననుభవింప జేయుటకు దగిన స్థూలశరీరము లాజీవుల కేర్పడుటకు కారణము లగును. అట్టివి భగవంతున కుండవు. అతడు నిత్యశుద్ధుడు, నిత్యముక్తుడు ననిభావము.

పరమేశ్వరుడు సృష్టి స్థితిలయము లొనర్చునుగదా! అవి కర్మములు కావా? వాని మూలమున బద్ధుడు కాడా? అందురేమో! అట్లనరాదు. సృష్టి స్థితిలయములు పరమేశ్వరుడు ఫలితములు కోరి చేయుకర్మములు కావు. పరమేశ్వరుడు వ్యాపకుడు-పూర్ణుడు. కావున నతని కేమికావలయును? ఏమియు నక్కఱలేదు. కోరి ఫలాపేక్షతో జేయు కర్మలే కర్మలనబడును. కావున నవి (సృష్టి స్థితిలయములు) దేహరూపబంధనమును గలిగింప హేతువులు కావు. జీవులకు గూడ ఫలాపేక్ష లేక చేయుకర్మలు బంధనహేతువులు కావు. కావుననే గీతలోకూడ

"త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః,
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః" (4-10)

"కర్మఫలమునం దాసక్తి విడిచి చేయదగిన - వేదవిహిత కర్మలు చేసియు చేయనివాడే యగును. అతడు నిత్యతృప్తుడు, నిరాశ్రయుడు కావున" అని చెప్పబడినదికదా!

కావున సృష్టి స్థితికార్యములు చేయుచుండియు పరమేశ్వరుడు బద్ధుడు కాడని తెలియవలయును.

పరమేశ్వరు డింకను నెట్టివాడన?

కవిః :- క్రాంతదర్శి-సర్వజ్ఞుడు, అని మంత్రము చెప్పుచున్నది. పరమేశ్వరుడు సృష్టికి కర్త. కర్తకు తా నొనర్చు కార్యమునకు సంబంధించిన జ్ఞానము పూర్తిగ నుండవలయును. సమస్త బ్రహ్మాండమును రచించు సృష్టికర్తకు తత్సంబంధమైన సంపూర్ణ జ్ఞానము ఉండవలయును. అందువలననే అతడు కవి - సర్వము తెలిసినవాడని చెప్పబడినది.

కవి యనగా లోకమున కావ్యమును రచించువాడు - అర్థవంతములయిన పదములను ఛందోబద్ధము చేయువాడని సామాన్యార్థము. అట్టి యర్థము కూడ భగవంతునికి చెల్లును. పరమేశ్వరుడు కవి,

ఆదికవి. అతని కావ్యము వేదము. అతడు నిత్యుడు కావున నతనికావ్యము - వేదము కూడ నిత్యమే. అది నశించునది కాదు. అందువలననే "పశ్య దేవస్య కావ్యం న మమార న జీర్యతి" - 'చూడు! దేవుని కావ్యము జీర్ణింపదు; చావదు' అని మొకచో చెప్పబడినది. ఈ దేవుని నిత్యకావ్యము నెఱుంగనివారు 'రామాయణము ఆదికావ్యమనియు, వాల్మీకియే ఆదికవి యనియు చెప్పుచుందురు. కాని ఆదికవి పరమేశ్వరుడే కాని అన్యుడు కాడు. ఇతర మహర్షులు - వ్యాసుడు, వాల్మీకి మున్నగువారెల్లరు వేదము లను జదివి తన్మూలముననే ఛందస్సులు, శబ్దార్థాలంకారములు వివిధ లక్షణములు నేర్చినవారు. కావున ఆదికావ్యము వేదము; ఆదికవి పరమేశ్వరుడు ననుమాట విద్వాంసులు మఱవరాదు.

మనీషి :- పరమేశ్వరుడు జీవులమనస్సుల కన్నింటికి నీశుడు - జీవుల మనస్సుల కత డధిపతి.

పరిభూః :- దుష్టకర్మముల నొనర్చువారిని పరిభవించి దండించు చుండును. ప్రాణులలో నుత్తమ ప్రాణులగు మానవులకు కర్మల నొనర్చుటకు స్వాతంత్ర్య మున్నదికదా! యని కన్నుమిన్ను గానక వేదనిషిద్ధ కర్మములను - దుష్టకర్మములను ఆచరించునెడల వారికి పరిభవ పూర్వకమైన దండనల నిచ్చువాడు పరమేశ్వరుడు. అత నికి దెలియకుండ నెవడు నెట్టి దుష్కర్మలు చేయజాలడు. అతని దండనను కూడ నట్లే తప్పించుకొనలేడు.

స్వయంభూః :- పరమేశ్వరుడు స్వయముగా నున్నాడు. అత నికి ఆది - కారణము అనున దేదియు లేదు. ఆ తత్త్వము కారణ జన్యము కాదు. అతనికి తల్లిదండ్రు లెవరును లేరు. కావున పర మేశ్వరుడు జన్మమరణములు లేక అనాద్యనంతుడై శాశ్వతముగా నుండు తత్త్వమని గుర్తింప వలయును.

శాశ్వతీభ్యః సమాభ్యః యాథాతథ్యతోఽర్థాన్ వ్యదధాత్ :- నిత్యములైయుండు జీవుల నిమిత్తము యథాతథముగ నర్థములను

సృష్టించును. జీవులు కూడ పరమేశ్వరునివలె స్వయంభువులే. వాని యుత్పత్తికి కూడ నొక కారణద్రవ్యము లేదు. కావున నవియు నుత్పత్తి వినాశము లేక యెల్లపుడు నుండు సూక్ష్మతత్త్వములు. అవి యొనర్చు కర్మలకు తగిన ఫలములనుభవించుటకు వీలుగ పరమేశ్వరుడు ప్రకృతిని స్థూల రూపములలోనికి మార్చుచుండును. కావున నీసృష్టియంతయు జీవులయుపభోగార్థమని గుర్తింపనగును.

ఇంతవఱకు వేదమంత్రమున వర్ణింపబడిన ఈశ్వరస్వరూపమును గూర్చి యొకింత వివరించియుంటిని. ఇట్టి వేదార్థములను సమాహిత బుద్ధితో గ్రహించి తరించిన మహర్షుల రచనల నాధారము చేసికొని యికముందు ఈశ్వరస్వరూపమును నిరూపింప యత్నింతును. అందువలన నీవ్యాసము చదివిన పాఠకుల కీశ్వరస్వరూప విషయమున నొక నిశ్చితాభిప్రాయము కలుగునని యెంచెద.

ఉపనిషత్తులు, దర్శనములు, మహర్షుల రచనలు. మహర్షులు వేదవిదులు కానివారికి ఈశ్వరుని స్వరూప స్వభావములను బోధించి ఆ యీశ్వరు నుపాసించు విధము నెఱుంగజేసి వారి నుద్ధరించుటకై తమ రచనలను ప్రారంభించి రనుట లోకవిదితము. కావున వారి రచనల నుండియు నీశ్వర స్వరూపము నిట పొందుపఱచుట యసంగతము కానేరదు.

"అణో రణీయాన్ మహతో మహీయాన్
ఆత్మాఽస్య జంతో ర్నిహితో గుహాయాం,
త మక్రతుః పశ్యతి వీతశోకో
ధాతు ప్రసాదా న్మహిమాన మాత్మనః" (కఠ 2-20)

ఇయ్యది కఠమహర్షి వచనము. అతడు ఈశ్వరుని లోకమునగల సూక్ష్మములగు అణ్వాదిపదార్థములకంటె (అణీయాన్) సూక్ష్ముడనియు, ఆకాశాదిమహాపదార్థములకంటె (మహీయాన్) గొప్పవాడనియు నుడువుచున్నాడు. కాబట్టి ఈశ్వరు డెల్లయెడల నన్నింటియందును వ్యాపించియున్నాడనుట నిక్కువము. కావున నట్టి

(పర) యాత్మ నెఱుంగగోరు వాడు తన హృదయమున నిగూఢ ముగ నున్నట్లు గుర్తించును. ఆత్మసాక్షాత్కారము హృదయమున నగును. కాని వెలుపల కాదనియు నిందు తెలియనగును. హృదయ మున పరమాత్మను సాక్షాత్కరింప జేసికొనుటకు జీవుడు "క్రతు రహితుడు" కావలయును. ఫలాపేక్షను విడిచి వేదవిహిత కర్మల నాచరింపవలయును. దానివలన నంతఃకరణము ధర్మాధర్మరూప సంస్కార రహితమై ప్రసన్నమగును. రాగాది దోషములు, విక్షేపాది చిత్త మాలిన్యములు దూరమగుటయే తడవుగ నీశ్వరసాక్షాత్కారము కలుగును. దుఃఖములు దరిజేరవు. ఆనందము ననుభవించును.

మఱియు నీ కఠమహర్షి తన యునిషత్తునందు మఱియొకయెడ నిట్లు ఈశ్వరస్వరూపమును నిరూపించి యుండుట చూడనగును.

"అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం
తథారసం నిత్య మగంధవచ్చ యత్,
అనా ద్యనంతం మహతః పరం ధ్రువం
నిచాయ్య తం మృత్యుముఖాత్ ప్రముచ్యతే" (కఠ. 2-15)

"ఈశ్వరుడు శబ్ద స్పర్శ రూప రసగంధముల కాస్పదము కాడు. ఆ గుణములన్నియు ఆకాశాదిభూతపంచకమునకు చెందినవి. ఆ భూతములు వికృతములు, వ్యయమగునవి, ఈశ్వరుడవ్యయుడు; నిత్యుడు; కారణరహితుడు; నాశము లేనివాడు - జన్మమరణములు లేనివాడని భావము. మహత్తత్త్వాది. సూక్ష్మ ప్రాకృతిక పదార్థ ములకంటెను అతడు సూక్ష్ముడు. అతని నెఱిగినవాడే మృత్యువాత బడక తప్పించుకొనగలడు".

మహర్షు లిట్లు ఉపనిషత్తులందే కాక సూత్రగ్రంథములందును ఈశ్వరుని స్వరూపమును వేదమంత్రము నందు వర్ణించినట్లే వర్ణించి యున్నారు.

వ్యాసమహర్షి బ్రహ్మసూత్ర రచయిత, అతడు ఈశ్వర స్వరూప లక్షణములను జెప్పుచు నిట్లు సూత్రించియున్నాడు.

"జన్మాద్యస్య యతః" (బ్ర.సూ.1-1-2)

అస్య=ఈయింద్రియ గమ్యమగు జగత్తునకు, జన్మాది=సృష్టి స్థితి లయములు; యతః=దేనివలన గలుగునో, అదియే బ్రహ్మము.

ఈ సూత్రమునందు ఈశ్వరుడు బ్రహ్మపదముచే వ్యవహరింప బడినట్లు గుర్తింపవలయును. సృష్టికర్తృత్వాదిసామర్థ్యము గల యా పరతత్త్వము వేదాదిశాస్త్రములం దనేక నామములచే జెప్పబడుటను పాఠకులు మఱువరాదు. వ్యాసు డిట ఈశ్వరుని సృష్టి స్థితిలయము లకు కర్తగా వర్ణించియున్నాడు. వేదమంత్రమున "యాథాతథ్యతో ర్థాన్ వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః" అని చెప్పిన వాక్యార్థమే యా సూత్రమున మహర్షి స్పష్టపఱచి యున్నాడు. ఈ సూత్రార్థమే -

"యతో వా ఇమాని భూతాని జాయంతే
యేన జాతాని జీవంతి,
యత్ ప్రయం త్యభిసంవిశంతి,
తత్ విజిజ్ఞాసస్వ, తద్ బ్రహ్మ" (తైత్తి. భృ.1)

అని ఉపనిషత్తుకూడ చెప్పియుండెను. ఈ ప్రపంచము యొక్క ఉత్పత్తి స్థితిలయములు మూడును ఈశ్వర లక్షణములు - ఈశ్వర సామర్థ్యబోధకము లని గుర్తింపనగును.

ఆత్మసాక్షాత్కారమునకు రాచబాటను బోధించిన పతంజలి మహర్షియు తన యోగదర్శనమున

"క్లేశ కర్మ విపాకాశయై రపరామృష్టః పురుషవిశేషః ఈశ్వరః" (యో.ద.1-24)

"అవిద్యాది క్లేశములతోను, శుభాశుభకర్మలతోను, ఆ కర్మలవలన జనించు ధర్మాధర్మ సంస్కారములతోను, ఎన్నడునెట్టి సంబంధము లేనివాడు ఈశ్వరుడు" అని ఈశ్వర స్వరూపమును నిర్ణయించి యున్నాడు.

క్లేశాదులతో జీవులకు సంబంధ ముండును. కావున వారు

ఈశ్వరులు కారు. క్లేశాదులతో నెన్నడు నెట్టి సంబంధము లేని వాడు పరమేశ్వరు డగును. జీవులు శరీరములతో శుభాశుభకర్మముల నొనర్చి వానితోనే యాకర్మఫలములను సుఖదుఃఖరూపమున ననుభవింతురు. అట్టి స్థితి ఈశ్వరున కెన్నడు కలుగదని యీ సూత్రమువలన బోధింపబడినది. కావుననే ఈశ్వరుడు (దేహధారియై) అవతారముల నెత్తుననుటయు, వాని మూలమున శిష్టరక్షణము, దుష్టశిక్షణము చేయుననుటయు వేద మంగీకరింపదని తెలియనగును. మహర్షులు కూడ వేదమునకు విరుద్ధముగ నీశ్వరుడు అవతరించునని యంగీకరింప రనియు బాగుగ తెలియుచున్నది.

శ్రీమద్ భగవద్గీతయందును ఈశ్వర స్వరూప మిట్లు వర్ణింపబడినది.

"జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యత్ జ్ఞాత్వాఽమృత మశ్నుతే,
అనాదిమత్ పరం బ్రహ్మ న సత్త న్నాస దుచ్యతే. 13-12

సర్వతః పాణిపాదం తత్ సర్వతోఽక్షిశిరోముఖం,
సర్వతః శ్రుతిమ ల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి. 13-13

సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియ వివర్జితం,
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ. 13-14

బహి రంతశ్చ భూతానా మచరం చరమేవ చ,
సూక్ష్మత్వా త్తదవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్. 13-15

అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితం,
భూతభర్తృ చ తద్ జ్ఞేయం గ్రసిష్ణు - ప్రభవిష్ణు చ." 13-16

'జ్ఞేయమగు బ్రహ్మతత్త్వము నెఱింగినవారు అమృతత్వము పొందుదురు. మోక్షానంద మనుభవింతురు. ఆ బ్రహ్మతత్త్వమునకు కారణము - ఆది లేదు. 'సత్-అసత్' అను పదములచే నది వ్యవహరింపబడదు. స్థూలప్రపంచమువలె కనిపించునది కాదు. కనుక దానిని సత్ పదముచే వ్యవహరించుటకుగాని, కుందేటి కొమ్ము వలె నభావముకాదు కావున, అసత్ పదముచే వ్యవహరించుటకుగాని

వలనుపడదని భావము.

ఆ బ్రహ్మతత్త్వమున కన్నియెడలను కాళ్ళు, చేతులు, కన్నులు, చెవులు, శిరస్సులు, ముఖములు నుండును. సర్వప్రపంచము నది యావరించి యుండును. ఇట్లనుటచే నాతత్త్వము మనుజులవలె కర చరణాద్యవయవములు, నేత్రాదీంద్రియములు కలిగియుండునని తలంప రాదు. అయ్యది వ్యాపకతత్త్వమని తెలుపుట కట్లు వర్ణింపబడినది. అందువలననే తరువాత శ్లోకమున -

బ్రహ్మతత్త్వమునకు జ్ఞానేంద్రియములు గాని, కర్మేంద్రియములు గాని యేమియు నుండవు. కాని సర్వేంద్రియశక్తులు దానియం దుండును అని స్పష్టపఱుపబడినది. ఉపనిషత్తులందును ఈతత్త్వ మిట్లే వర్ణింపబడినది. "అపాణిపాదో జవనో గ్రహీతా, పశ్య త్యచక్షుః స శృణోత్యకర్ణః" - "హస్తపాదాది కర్మేంద్రియములు, చక్షురాది జ్ఞానేంద్రియములు లేకయే యా యా యింద్రియములచే నొనరింపదగు కార్యములనెల్ల నొనర్చువాడు పరమేశ్వరుడు".

అట్టి యా బ్రహ్మతత్త్వ మీ బ్రహ్మాండమును ధరించి యున్నది. అన్నింటికి నది యధిష్ఠానము - ఆధారము. కాని అది దేని యందును లగ్నము కాదు. సత్త్వరజస్తమో గుణము లందుండవు. అవి ప్రకృతి గుణములు. ఆ గుణము లన్నింటినది పాలించును - అదుపులో నుంచును. సూక్ష్మప్రకృతిని స్థూలమొనర్చి జీవుల యుపభోగానుకూలము చేయునని భావము.

సమస్త పదార్థములకు, సర్వప్రాణులకు లోపల వెలుపల నంతట నా బ్రహ్మతత్త్వ మోతప్రోతమై యుండును. కావున నది చలిం పదు. అన్నింటిని తన శక్తిచే చలింప జేయును. అది అత్యంత సూక్ష్మమగుట వలనను, ప్రాకృతికములగు రూపాది గుణములు లేని దగుటవలనను ఇంద్రియములచే గ్రహింపబడదు. వ్యాపకమగుట వలన దూర సమీప భేదము లేక యెల్లయెడల నుండును.

పదార్థము లన్నిటియందు నఖండితమై యుండియు నజ్ఞులకు

మాత్రమన్నిటియందు ఖండితమై యున్నట్లుండును. ప్రపంచ పదార్థములను పుట్టించి పోషించి లయము చేయుచుండును.

ఇట్లు శ్రీమద్ భగవద్గీతయు వేదమంత్రములలో వర్ణింప బడినట్లే ఈశ్వర స్వరూపము నిరూపించుచు "హృది సర్వస్యాధిష్ఠితమ్", అని ఆత్మసాక్షాత్కారము హృదయమున నగును; కాని వెలుపల కాదనియు సూచించినది.

ఇట్లు వేదశాస్త్రములందు పరమేశ్వరుని స్వరూపమును గూర్చియు, నతడొనర్చు కార్యములను గూర్చియు, అతని సామర్థ్యాదులను గురించియు స్పష్టముగా వివరింపబడినది. పరమేశ్వరుని స్వరూపమును, సామర్థ్యాదులను గుర్తించిన విద్వాంసుడు మానవ జీవితమున వేద విహిత కర్మలను నిష్కామబుద్ధితో నిర్వర్తించి జన్మజరామరణాది బంధనములనుండి విముక్తుడు కాగలడు. ఇయ్యది గుర్తింపనివాడు జీవితమున దుష్కర్మల నాచరించి, జడపూజల నొనర్చి, అజ్ఞుడై దుఃఖముల ననుభవించుచు జీవిత సాఫల్యమును బొందలేక వ్యర్థుడగును.

"ఇహ చే దవేదీ దథ సత్యమస్తి
న చే దవేదీ న్మహతీ వినష్టిః."

ఇతి శమ్

ఓమ్

వైదిక వర్ణ వ్యవస్థ

భారతీయులు మానవసృష్టి యేర్పడిన నాటినుండియు వైదికులు. వేదవిహితధర్మములు నాచరించువారు. వారిలో వర్ణవిభాగము, ఆశ్రమ విభాగము నను నవియు నతిప్రాచీనము లనుటలో నేరికిని అసమ్మతము కాదు.

కాని నేడు భారతీయులలో వర్ణవిభాగమునకు బదులు కులవిభాగములు మెండుగ కనిపించుచున్నవి. నేటి పండితులు, పామరులు నెల్లరు కులము, జాతి, వర్ణము నను పదములను సమానార్థకములుగ వాడుచున్నట్లు చూడనగును. నేటి చదువరుల వ్యవహారమునందును మానవులెల్లరు నొక్క జాతికి చెందినవారుగా కనిపింపరు. పాశ్చాత్యులు - నల్లగానుండు ఆఫ్రికాదేశవాసులు మున్నగువారిని తమకంటె భిన్న జాతికి చెందినవారినిగా నెంచి వారియెడ నమానుషముగ వర్తించుట యెవ్వరెఱుగరు! నేటి చరిత్ర రచయితల దృష్టిలో కూడ హూణులు, మంగోలియనులు, ఆర్యులు, ద్రవిడులు నని యెన్నో భిన్నజాతులకు జెందిన మానవులున్నారు.

ఇక భారతదేశమున నివసించు మానవులలో గల జాతులకు అంతు-పొంతు కనిపింపదు. మానవులెల్లరు నొక్క జాతికి చెందినవారే యని మాదృశు లెవరైన పలికిన నది తప్పిదముగా నెంచబడును. ఇక్కడ హిందువులనబడువారు తమలో నెన్నో జాతులు, ఉపజాతులు కల్పించుకొని ఒకరి కొకరెంతో దూరముగ నున్నారు. ఒకరి పొత్తు మఱియొకరికి గిట్టదు. ఒకరి శ్రేయస్సు నింకొకరు కోరరు. హిందువులలో గల నేటి పారస్పరిక వ్యవహారము నొక్కసారి తిల

కించినపుడు వారొక్క జాతికి చెందినవా రనుట కెట్టి యాస్కారము కనిపింపదు. ఒక వ్యక్తి మఱియొక వ్యక్తిని జూచినపుడు 'మీ రెవరు' అని ప్రశ్నించును. ఈ ప్రశ్నము మిక్కిలి సామాన్యము. నేను ధర్మప్రచారకుడ నగుటచే భిన్నభిన్న గ్రామములకు, నగరములకు, ప్రాంతములకు నేగుచుందును. వెళ్ళిన తావులలో నన్నియెడల 'మీ రెవరు' అని ప్రశ్నకు సమాధానము చెప్పక తప్పలేదు. ప్రశ్నించువారి వలె నాకును ముక్కు, మొగము, కాళ్ళు చేతులు, ఇతరావయవములు నున్నవి. తినుటలో, త్రాగుటలో, నిద్రాది వ్యవహారములలోను నెట్టి భేదముండదు. ఈ విషయము లన్నియు తెలిసినమీదటను 'మీ రెవరు' అని ప్రశ్నించినపుడు వారికి నేనేమి సమాధానము చెప్పవలయునో తోచక 'నేను మనుష్యుడనే' యని సమాధానము చెప్పుచుందును. ఆ సమాధానము వారికి తృప్తి కలిగింపక మరల 'అది కాదండే, మీరు మనుష్యులే కాని మీ రెవరో తెలియక అడుగుచున్నామండే! మీరే మనుకోవద్దు' అందురు. అటుపైని కొంచె మాలోచించి నేను క్రైస్తవుడనో, మహమ్మదీయుడనో, బౌద్ధుడనో, జైనుడనో లేక హిందువునో తెలిసికొనగోరి ప్రశ్నించుచున్నా రేమో యని యెంచి వారి తృప్తి కొఱకు 'నేను హిందువు' నని చెప్పుదు ననుకొనుదు. అప్పుడును 'మీ రెవరు' అను ప్రశ్నము నన్ను విడువదు. 'అది కాదండీ, మీ మాటలు, మీ తీరుతెన్నులు చూడగనే మీరు హిందువులే యని తెలియుచునే యున్నది. అయినను మీ రెవరు? అని మరల ప్రశ్నింతురు. ఇప్పుడేమి చెప్పవలయునో నాకర్థముకాదు. హిందువని చెప్పుకొనుటయే నాకు సరియైన సమాధానముగ గనిపింపదు. హిందువు, క్రైస్తవుడు, మహమ్మదీయుడు మున్నగు పదములు ఆ యా తెగలకు సంబంధించినవా రనుసరించు మతములను దెలుపు పదములగును; కాని మఱియొండు కాజాలవు' నీ వే మతమునకు జెందినవాడవు? అని ప్రశ్నించినపుడు 'నేను హిందువును, క్రైస్తవుడను, లేక మహమ్మదీయుడనో' యని చెప్పుట యుచితమగును. ఈ యౌచిత్యమును పాటింపకయే 'నేను

హిందువు'నని చెప్పినను సంతోషింపక మరల మీ రెవ రనిన ఏమి చెప్పవలయునో తోచక 'నా పేరు గోపదేవ్. నేను ధర్మప్రచారము చేయువాడను' అని చెప్పుదుననుకొనుడు. ఆ సమాధానము కూడ వారికి సంతృప్తిని కల్పింపదు. అందువలన వారు మరల 'అది కాదండి, మే మడుగునది! మీరు ధర్మప్రచారకు లనియు మీపేరు 'ఫలానా' అనియు మాకు మిమ్ములను పరిచయము చేయు కరపత్ర ములవలన తెలిసినదండీ! అయినను మీ రెవరో తెలిసికొనవలయునని యడుగుచున్నా మండి. మీరు అన్యథా భావింపకండి, అందురు. ఇప్పుడు వీరి కేమి చెప్పవలయునో, ఎట్లు చెప్పవలయునో తోచక యీ ప్రశ్నకు కులగోత్రములు సమాధాన మేమో యని యెంచి 'నేను మాలవాడ నండి' అందు ననుకొనుడు. ఆ సమాధానము కూడ వారికి తృప్తి కల్పింపదు. 'అయ్యా, మీ రామాట అంటే, మేము నమ్ముతామండీ! మేమంత తెలివితక్కువవార మటండీ! మీ కేదో కోపము వచ్చినట్లున్నది. మీరు మాలవా రెట్లవుదురండీ! మీ విద్య, మీ సంస్కారము, మీమాటలతీరు చెప్పదటండీ! మీరెంత దాచినను డాగుతుం దటండీ! కాబట్టి అసలు మీ రెవరో తెలిసి కొనవలయునని అడుగుచున్నామండి. మీరు బ్రాహ్మణులే. అందులో సందేహము లేదులెండి. కాని వైదికులా? నియోగులా? అనేది తెలి యక లెండి మా ప్రశ్నలు! అందులోను నియోగులు కారనియే మా నమ్మిక. వారి కీ శాస్త్రపాండిత్యము! ఇది యెక్కడినుండి అబ్బుతుంది? అందువలన మీరు వైదికులేకాని, వెల్నాటివారో, వేగినాటివారో, మురికినాటివారో తెలిసికొనవలయునని మా తాప త్రయము' అందురు. ఇట్టి స్థితిలో వారికి నేనేమని చెప్పవలయునో అర్థముకాక తికమక పడవలసి వచ్చుచుండును. నేను వారియింట తినుటకుగాని, త్రాగుటకుగాని వెళ్ళనైతిని. వియ్య మందుటకైన వెళ్ళినవాడ గాను. అట్టియెడ నన్ను గూర్చి 'మీ రెవరు' అను నీ ప్రశ్న మెందులకు? నాకులగోత్రములను దెలిసి కొనినందున వారికి వచ్చు ప్రయోజనమేమి? ఏమియు లేదు. ఇది యంతయు 'నే

నే జాతి కుల వర్ణములకు జెందినవాడనో తెలిసికొని, అడిగినవారి కులమునకు జెందినవాడ నగుపక్షమున నొకింత సంతోషించుటకో లేక యాదరించుటకో చేయుపరిశ్రమము. అంతకు మించి మఱి యొందు కనిపింపదు. నేను వారిజాతికి, కులమునకు, వర్ణమునకు చెందినవాడను కాను, అని తెలియగానే నా విద్వత్తు, నా సంస్కారము, నా వాక్చాతుర్యము, ఇతరగుణములు నన్నియు కొఱగానివి యగును. నేను పనికి మాలినవాడ నగుదును. ఇదియే యీ ప్రశ్నకు ఫలము. భారతీయులలో నేడు మిక్కిలిగా వెఱ్ఱితలలు వేసిన యీ జాతిభేదమువలన దేశమునకు, మానవజాతికి కలిగిన దుష్పరిణామమును కొన్ని పంక్తులలో వర్ణింప నెవ్వరికిని తరము కాదని నాయభిప్రాయము. వాస్తవమున జాతి, కులము, వర్ణము ననుపదములందును, వానియర్థములందును గల భేదము హిందువులు గుర్తింపకున్నారు.

ప్రపంచదేశములలో గల మానవు లెల్లరు నొక్కజాతికి జెందిన వారే. రంగు, ఆచారములు, భాషలు, ఒడ్డుపొడవులు, అవయవములలో గుండ్రని మొగము, కోల మోము, పెద్దముక్కు, చిన్నముక్కు, సొట్ట ముక్కు ననుభేదములను పురస్కరించు కొని మానవులు పలుజాతులకు జెందినవారని యెంచుట అవివేకము. జాతియన జన్మము. మానవులు జన్మమునుబట్టి ఒక్క తెగకు - జాతికి చెందినవా రనుటలో నెట్టి సంశయము లేదు. న్యాయశాస్త్ర (తర్కము) రచయిత యగు గోతమ మహర్షి జాతిపదము నెట్లు నిర్వచించినాడో చూడుడు:

'ఆకృతి గ్రహణా జాతిః' న్యా.ద.

'జాతి ఆకృతి - ఆకారమువలన గ్రహింపదగినది' అని సూత్రార్థము. ఆకారమునుబట్టి మానవు లెల్లరు నొక్కజాతికె జెందినవారనుట కభ్యంతర ముండదు. రంగులో, కొలతలలో నొక్కింత భేదమున్నను అవయవసంనివేశమును బట్టి మనుష్యుడు మనుష్యుడుగా

గ్రహింపబడుటలో నెట్టి సందియము నుండదు. వ్యక్తులలో నెంత భేదమున్నను ఇతడు మనుష్యుడే 'ఇతడు మనుష్యుడే; ఇతడు మనుష్యుడే' అని యందఱిలోను మనుష్యుడే యను సామాన్య జ్ఞానము కలుగును. అట్టి సామాన్య జ్ఞానము కలుగుటకు, ఆ వ్యక్తులందఱిలోను నేదియో సామాన్య ధర్మము ఒకటి యుండవలయును. అదియే మానవత - మానవత్వము. దానినే జాతియని నైయాయికు లందురు. ఇట్లే పశువులలో గోత్వాదులు నని యెఱుంగ నగును. ఇట్లు మానవులు, గోవులు, అశ్వములు, వ్యాఘ్రములు, శునకములు మున్నగు ప్రాణులు భిన్న జాతులకు జెందిన వని గుర్తించుట యెల్లరకు సులభము. ఆకృతులను బట్టియే యవి భిన్నజాతులని తెలియును.

గోతముడు, నవ్య నైయాయికులు చెప్పిన లక్షణములను బట్టి మానవు లెల్లరు నొక్కజాతికి చెందినవా రనియే తెలియుచున్నది. అయినను హిందువులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, ఇంకను చాకలి, మంగలి, మాల, మాదిగ మున్నగు వందలాది పదములు భిన్న భిన్న జాతులను తెలుపుచున్న వనియు, వీరెల్లరు నొక్కజాతికి చెందినవారు కారనియు నెంచుచున్నారు; వ్యవహరించుచున్నారు. పైన వర్ణించిన బ్రాహ్మణాది పదములచే వ్యవహరింపబడువారి పిల్లలను పలువురి నొక్కచో జేర్చుడు. వారికి భిన్న భిన్న వేషభాషల నమర్చక పుట్టినవారిని పుట్టినట్లు నగ్నులుగా నిలబెట్టుడు. వారి యాకృతులను జూచి యెంతటి విజ్ఞుడైనను, ఎంతటి కొమ్ములు తిరిగిన పండితుడైనను వారిలో బ్రాహ్మణబాలు రెవరో, క్షత్రియబాలు రెవరో, వైశ్య శూద్రుకులజు లెవరో, మాల, మాదిగ, చాకలి, జంగమ బాలు రెవరో గుర్తింపగలడా? గుర్తింపజాలడు. అందఱిని మనుష్యుల పిల్లలనుగా గుర్తించుటలో నెవ్వడును పొరబడడు. మానవ బాలురను మానవులనుగా - మానవజాతికి చెందిన వారినిగా గుర్తించుటకు విద్వత్తు - పాండిత్యము ఏదియు నవసరముండదు. ఆకృతి యెల్లరకు సులభగ్రాహ్యము.

కావున మహర్షి చెప్పిన ఆకృతి (ఆకారము)చే జాతిని గుర్తించుటలో నెవ్వరును పొరబడవలసిన యవసరమే యుండదు.

ఇంతే కాక మహర్షి గోతముడు జాతిని గుర్తించుటకు మఱి యొక లక్షణముకూడ చెప్పియున్నాడు.

'సమాన ప్రసవాత్మికా జాతిః'

లోకమున నే యిరువురు స్త్రీ పురుషులు కలిసి మైథునము ద్వారమున తమవంటి సంతానమును గందురో ఆ స్త్రీపురుషు లిరువురు నొకే జాతికి చెందినవారని యీ వాక్య తాత్పర్యము. సంతానపుటాకృతిని బట్టియు మాతా పితరుల జాతిని నిర్ణయింప గలమని యభిప్రాయము. ఈ లక్షణమునుబట్టి చూచినను బ్రాహ్మ ణత్వము, క్షత్రియత్వము, వైశ్యత్వము, శూద్రత్వము, రజకత్వము, నాపితత్వము, చండాలత్వము మున్నగునవి భిన్నజాతులు కావని స్పష్టమగుచున్నది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాదులు భిన్న జాతులకు చెందినవారు కారని పై లక్షణములనుబట్టియు ఋజువగు చున్నది. కారణమేమన బ్రాహ్మణు డనబడువాని పుత్రికను వైశ్యుడని పిలువబడువాని కుమారుడు పెండ్లి చేసికొని సంతానము కనున నుకొనుడు. ఆ సంతానము తల్లిదండ్రులంబోలి యుండునే కాని విపరీతముగా నుండదు గదా! కావున బ్రాహ్మణపుత్రిక, వైశ్యకుమా రుడు నిరువురు నొకేజాతి - మానవజాతికి చెందిన వారనుటలో నెట్టి దోషము లేదు. వారిరువురు భిన్నజాతులకు చెందినవారగు పక్షమున వారి మైథునక్రియ (దాంపత్యము) వలన వారిరువురిం బోలిన మానవ సంతానము కలుగక యుండవలసినది.

భిన్న జాతులకు సంబంధించిన స్త్రీ పురుషులలో సంపర్కము కలుగుటయే సంభవము కాదు. సింహము గోవుతో సంపర్కము చేయగలదా! కృత్రిమ సంబంధ మెటులైన కల్పించినను వాని సంబంధమువలన సంతానము కలుగనేరదు. ఒకవేళ కలిగినను ఆ స్త్రీపురుషుల యాకృతిని బోలిన యాకృతిగల సంతానము కలు

గదు. చూడుడు: గుఱ్ఱము, గాడిద యను జంతువుల యాకృతిలో కొంత సామ్యము చూతుము. వాని పరిమాణములో భేదమున్నను ఆకృతి సామ్యము చూడనగునని యాశయము. వాని సంపర్కమువలన కలుగు సంతానము గుఱ్ఱముకాక, గాడిదయుకాక రెంటికి భిన్నముగా కంచరగాడిద పుట్టును. ఆ కంచరగాడిదలకు తరువాత సంతానము కలుగకుండుటయు లోకవిదితము. ఇట్లు భిన్న జాతి స్త్రీపురుష వ్యక్తులకు సమానాకృతి గల సంతానము కలుగదనుట నిశ్చయము. కావున బ్రాహ్మణ క్షత్రియాదులు భిన్నజాతులకు జెందినవారగునెడల వారిలో స్త్రీ పురుష సంబంధము వలన మాతాపితరులవంటి సంతానము కలుగక యుండవలయును. కాని, శ్రీ చక్రవర్తుల రాజ గోపాలాచార్యులు బ్రాహ్మణులు. వారి పుత్రికను గుజరాతి వైశ్యుడైన మహాత్మ గాంధిగారి కుమారుడు పెండ్లి చేసికొని సంతానము కనుట మన మెఱుగనిది కాదు. దేవదాసుగాంధి సంతానము నెఱుగనివా రెవరుందురు భారతమున! ఈ సంతానము - తమ తల్లి దండ్రులు వైశ్య బ్రాహ్మణ నామధారుల సంతానములయ్యు నొకే మానవజాతికి చెందినవారే యని చాటి చెప్పుట లేదా! కావున బ్రాహ్మణ క్షత్రియాది పదములు భిన్న భిన్న జాతివాచకములు కావని చెప్పుటకు ఇంతకంటెను ప్రబల ప్రమాణము లేమి కావలయును? నేడు భిన్న భిన్న కులనామములచే బేర్కొనబడు యువతీయువకు లెందఱో పరస్పరము వివాహమాడి తమవంటి చక్కని సంతానము కనుట నిత్యము చూచుట లేదా? ఆ యా కుల నామములచే వ్యవహరింపబడు వ్యక్తులు భిన్న జాతులవా రగుదురా? ఎన్నడు కారు. ఎల్లరు మానవజాతికి చెందినవారే. పై ఉదాహరణములను, లక్షణములను గుర్తించి వాని ననుసరించి జాతియన నేమో తెలిసినమీదట బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాది పదములు జాతివాచకములు కావని చదువరులకు స్పష్టమై యుండునని యెంచెద.

హిందువులలో కొందఱు బ్రాహ్మణాదిపదములు జాతివాచకములేయని చెప్పుచు వేదమంత్రము ప్రమాణముగా నుదాహరింతురు.

ఎక్కువగా నిట్లు చెప్పువారు బ్రాహ్మణనామధారులే యగుట నిక్కు వము. వారు యజుర్వేదములోని యొకమంత్రము నుదాహరింతురు.

'బ్రాహ్మణోఽస్య ముఖ మాసీద్ బాహూ రాజన్యః కృతః
ఊరూ తదస్య యద్వైశ్యః పద్భ్యాం శూద్రోఽజాయత'
(యజు. 31.11)

ఈ మంత్రము నేకరువు పెట్టి దీని కర్థము నిట్లు చెప్పుదురు. 'బ్రహ్మముఖమునుండి బ్రాహ్మణుడు, బాహువులనుండి రాజన్యుడు - క్షత్రియుడు, ఊరువుల (తొడల) నుండి వైశ్యుడు, పాదములనుండి శూద్రుడును పుట్టినాడు'.

ఈ మంత్రమును, మంత్రార్థమును పురస్కరించుకొని పుట్టు కతో బ్రాహ్మణత్వము, క్షత్రియత్వము, వైశ్యత్వము సిద్ధించుననియు, కావున బ్రాహ్మణాది పదములు జాతివాచకములే యనియు, బ్రాహ్మణ క్షత్రియాదు లొకరు మఱియొకరికంటె తక్కువ - నీచులు ననియు చెప్పుచుందురు.

ఇంతేకాక వేదములు ఈశ్వరీయములు కావున నవి స్వతః ప్రమాణము లనియు, వేదము చెప్పినది యంగీకరింపక వలనుపడద నియు చెప్పి వేదాధ్యయనము చేయని యమాయికులను ఒప్పింప యత్నింతురు. కాని వాస్తవ మారయ ఈ బ్రాహ్మణ బ్రువులు చెప్పునది యసత్య మని తెలియకపోదు. ఈ మంత్రమునకు వారు చెప్పునది సరియైన యర్థము కాదని తెలిసికొనుట కష్టము కాదు. ఈ మంత్రమున గల బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర పదములు జాతివాచకము లనుట కెట్టి యవకాశము లేదు. ఇందు బ్రాహ్మ ణులు, క్షత్రియులు, వైశ్యాదులు బ్రహ్మము ముఖ బాహూరువుల నుండి పుట్టిన వారనియు లేదు. ఈ మంత్రముతో బ్రహ్మపదమున కెట్టి సంబంధమును లేదు. ఈ మంత్రము పురుషసూక్తములో గల అనేక మంత్రములలో నొక్కటి. దీనికి పూర్వమున నింకొక మంత్ర మున్నది. అది యిది.

'యత్ పురుషం వ్యదధుః, కతిధా వ్యకల్పయన్? ముఖం
కి మస్యాసీత్? కిం బాహూ? కి మూరూ? పాదా ఉచ్యేతే'

(యజు 31-10)

'ఏ పురుషుని వర్ణించిరో యతని నెన్నివిధముల కల్పించిరి? అతనికి ముఖమేమి? బాహువులేమి? ఊరువు లేమి? పాదము లేమని చెప్పబడును?' అని మంత్రార్థము. ఇయ్యది ప్రశ్నమంత్రము. ఇంతకు పూర్వము వ్రాసిన బ్రాహ్మణోఽస్య ముఖ మాసీత్..... అను మంత్రము సమాధానమంత్ర మనబడును. కావున నీ మంత్రమున పై ప్రశ్నములకు సమాధానముగ కల్పిత పురుషుని ముఖమేమి యన - బ్రాహ్మణుడనియు, బాహువు లేమియున - క్షత్రియుడనియు, ఊరువులు వైశ్యుడనియు, పాదములు శూద్రుడనియు చెప్పబడినది.

ప్రశ్నలలో బ్రహ్మముఖమునుండి జనించిన దెవరు? అని కాని, బాహ్వాదులనుండి పుట్టిన దెవరనికాని యడుగనే లేదు. అట్టియెడ బ్రహ్మముఖాదులనుండి బ్రాహ్మణాదులు పుట్టినారని సమాధానము చెప్పుట యెట్లు సమంజసమగును? ప్రశ్నమంత్రమును మఱుగు పఱచి ప్రశ్నల స్వరూప స్వభావములను తెలియనీయక బ్రహ్మ ముఖాద్యవయవములు బ్రాహ్మణాదుల జన్మములకు స్థానము లైన ట్లును, కావున ముఖ బాహూరు పాదములు శరీరమున నొకదానికంటె నింకొక యవయవము క్రింద నుండుటచే నా యా యవ యవముల నుండి పుట్టిన బ్రాహ్మణాదులు జన్మతః పుట్టుకతోనే ఒకరికంటె నింకొకరు నీచులు - తక్కువవారు అనియు కల్పించి వాని నాచరణలో బెట్టనెంచుట యెంతటి వంచనయో, ఘోరమో పాఠకు లూహింతురుగాక! బ్రాహ్మణాది పదములు జాతి వాచకము లనుటకు వేదమును ప్రమాణముగా చెప్పుట చదువుసంధ్యలు లేకున్నను పుట్టుకతోనే తమ ప్రాముఖ్యమును కాపాడుకొని సంఘమున పూజింపబడుటకు బ్రాహ్మణులు చేయు వంచనకాక మఱి యేమ

గును?

ప్రశ్నమంత్రమున గాని, సమాధాన మంత్రమున గాని, అంతకు పూర్వ మంత్రములందు గాని యెక్కడను కనబడని బ్రహ్మపద మీ 'బ్రాహ్మణో స్య ముఖ మాసీ' దను మంత్రమున నెటనుండి యను వర్తింతురో - అన్వయింతురో బ్రహ్మకే తెలియును. మానవులకు మానస గోచరము కూడ కాదు. బ్రహ్మపద మాకసమునుండి తెచ్చి పెట్టుకొందమన్నను నది మంత్రమున నతుకదుకదా! ఎట్లో యతికించినను బ్రహ్మమునకు ముఖాద్యవయవముల నెటనుండి తేగలము? బ్రహ్మము విశ్వవ్యాపకతత్త్వము గదా! అందు ముఖాద్యవయవము లెక్కడ? వాని నుండి బ్రాహ్మణాదులు పుట్టు టెక్కడ? ఎట్లో కల్పింత మన్నను ఆ కల్పనలో గల యౌచిత్యమేమి? బ్రాహ్మణాదులు పుట్టుటకు తగిన యోను లా బ్రహ్మ శరీరావయవము లందుండు పక్షమున నా బ్రహ్మ రూపము ఈ బ్రాహ్మణ భక్తులకు దర్శింప నర్హమగునా? శరీరమునందంతట యోనులు గల బ్రహ్మము దర్శనీయము - సాక్షాత్కారయోగ్యము నగునా? దర్శించి వా రానందింతురా? ఇది యేమి కల్పన!

ఒకవేళ బ్రహ్మకు ముఖమే యుండి, అందుండి పుట్టినమాత్రమున బ్రాహ్మణుడు తక్కినవారికి పూజ్యుడు, వారికంటె శ్రేష్ఠుడు నెట్లగును? ముఖమునుండి పుట్టిన వన్నియు శ్రేష్ఠములే యగునని నియమ మెక్కడ? బ్రహ్మమునకు గల ముఖాద్యవయవములు బ్రహ్మముకంటె భిన్నములుగ వ్యవహరింపబడునా? అవయవ సంఘాతమే కదా బ్రహ్మము! ఒకే బ్రహ్మమునుండి పుట్టినవారు భిన్నజాతులకు చెందినవా రెట్లగుదురు? బ్రహ్మమునుండి జనించిన సంతానము బ్రాహ్మమే యగును కాని విభిన్నపదవాచ్య మెట్లగును?

'న విశేషోऽస్తి వర్ణానాం సర్వం బ్రహ్మ మిదం జగత్'
(మ. భా. శాంతిప. 188-10)

కావున బ్రాహ్మణాది పదములు జాతివాచకము లనుటకు వేద

మును ప్రమాణముగ జెప్పుట యెట్లు చూచినను సమర్థనీయము కాదు.

వేదమంత్రములందు పలుచోట్ల బ్రాహ్మణ క్షత్రియాది పదములు చూడనగును. కాని యెక్కడను నీ పదములతో జాతిపదము జోడించి ప్రయోగించుట చూడము.

'రుచం నో ధేహి బ్రాహ్మణేషు, రుచం రాజసు నస్కృధి!
రుచం విశ్యేషు శూద్రేషు, మయి ధేహి రుచారుచమ్!!'

(యజు. 18-48)

ఇందు బ్రాహ్మణ క్షత్రియవైశ్య శూద్ర పదములు చూచుచున్నాము. ఇట్లే పలుమంత్రములందు చూతుము. ఎక్కడను బ్రాహ్మణ జాతి, క్షత్రియజాతి, వైశ్యజాతి, శూద్రజాతి యని జాతిపదముతో చేర్చి బ్రాహ్మణాది పదములు ప్రయోగింపబడుట చూడము. కావున బ్రహ్మముఖాద్యవయవములనుండి పుట్టుటచే బ్రాహ్మణాది పదములు జాతిని తెలుపును. జన్మముతోనే బ్రాహ్మణాదిపదవాచ్యులు భిన్నజాతులకు సంబంధించినవారగుదురు; అనుటయు పొసగదు. అయినచో 'బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్.......' అను మంత్రమున కర్థమేమగునని చదువరు లడుగవచ్చును.. మానవజాతి నంతటిని విరాట్ పురుషునితో బోల్చి దానికి పురుషాకృతిని కల్పించినపుడు బ్రాహ్మణు డనబడువాడు ముఖమువంటివాడనియు, క్షత్రియుడు బాహువులవంటివా డనియు, వైశ్యుడు ఊరువులతో బోల్చదగినవాడనియు, శూద్రుడు పాదస్థానీయు డనియు చెప్పవచ్చునని మంత్రార్థమగుచున్నది. కావున నీ బ్రాహ్మణాది పదములు గుణవాచకములే కాని జాతివాచకములు కావు. పురుషుని యాకారమును దెలుపు శరీరమునందు ముఖమున - శిరోభాగమున జ్ఞానేంద్రియములు - నేత్రాదులు అన్నియు నున్నవి. కావున జ్ఞానము ప్రధానముగ - ఎక్కువగ నుండువ్యక్తి, బుద్ధిబలముతో జీవించువాడు బ్రాహ్మణు డనబడును. బ్రహ్మ మనగా జ్ఞానము, వేదము, పరమేశ్వరుడు నని యర్థము. జ్ఞానము కలిగి వేదాధ్యయనాదుల నొనర్చి, పరమేశ్వర

ప్రాప్తికై నిరంతరము యత్నించు వ్యక్తి బ్రాహ్మణు డని యర్థము. అట్లే 'క్షాత్రం వై వీర్యమ్' క్షాత్ర మనగా వీర్యము. పరాక్రమము, బలము మున్నగు గుణము లెక్కువగా గలవాడు క్షత్రియు డనబడును. క్షత్రియునియందు జాతిని, దేశమును రక్షించు గుణములు మిక్కిలిగా నుండునని భావము. అందువలననే బాహువులతో నతడు పోల్చబడును. శరీరమున కపాయము వాటిల్ల నున్న సమయమున బాహువులు ఆ యపాయమునుండి శరీరమును రక్షింప యత్నించును. తలపై నెవరైన కొట్ట యత్నించినప్పుడు వెంటనే చేతు లడ్డము పెట్టు కొని శిరస్సును దెబ్బలనుండి కాపాడుకొనుట నెవ్వ రెఱుగరు! ఇట్లే శరీరమును స్థిరముగ నుంచుటకు ఊరువులు తోడ్పడును. తొడల బలముతో నెక్కువ సమయము కూర్చుండ ననువగును. కావున మానవజాతిని పోషించుట కనువగు ద్రవ్యములను సేకరించి వాని మూలమున జాతిని పోషింప యత్నించు వ్యక్తి వైశ్యుడనబడును. అదేవిధముగ పాదములు శరీరము నిటునటు తీసికొని పోవుట కుప యోగించును. శరీరమును నిలబెట్టుటకు తోడ్పడును. పాదములవలె జాతినిలకడకు జాతి జవసత్వములను కాపాడుటకు నుపయోగించు వ్యక్తి శూద్రు డనబడును. శరీరమునందలి ముఖాద్యవయవములు భిన్న భిన్న గుణములు కలిగియుండి శరీరస్థితికి సర్వవిధముల తోడ్పడునట్లు మానవజాతి పోషణకు, దాని మనుగడకు నవసరమగు గుణవిశేషములు కలిగిన వ్యక్తులు తోడ్పడుచుందురు. ఆయా గుణవి శేషములను బట్టి మానవులు బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రపదములచే వ్యవహరింపబడుదురు. అంతే కాని బ్రాహ్మణాదులు భిన్నజాతులకు సంబంధించిన వారు కారు. కావున వారిలో జన్మతః ఒక రెక్కువ మఱియొకరు తక్కువయని యెంచుట యుచితముకాదు. శరీరమున గల యవయవములు వానివాని కార్యములను సక్రమముగ నెఱవే ర్చుచు శరీరస్థితికి తోడ్పడిననాడు శరీరయాత్ర చక్కగ జరుగును. ఆవయవములలో నేది చెడినను శరీరయాత్రకు, మనుగడకు భంగము కలుగును. అట్లే బ్రాహ్మణాదిపదములచే వ్యవహరింపబడు వ్యక్తులె

లిరు వారి గుణములకు దగినట్లు, శక్తిసామర్థ్యముల ననుసరించి కర్తవ్యకర్మల నాచరించినంతవఱకు మానవజాతి చక్కగ వర్ధిల్లును. బాహువులు, ఊరువులు, పాదములు తోడ్పడనినాడు, కేవలశిరస్సు - ముఖ మేమి చేయగలుగును? శిరస్సు తగినట్లు పనిచేయకున్న బాహ్వాదు లెందుకైన పనికివచ్చునా? అవయవము లన్నియు వాని స్థానముననవి యూరోగ్యము కలవియై స్వకార్యములను నిర్వర్తించిన నాడు శరీరమంతయు చక్కగ నుండును. అందువలననే జ్ఞానాది గుణవిశేషములవలన బ్రాహ్మణాది పదములచే పిలువదగు వ్యక్తులు ముఖాద్యవయవములతో పోల్చి వేదమంత్రమున చెప్పబడినారని గుర్తింపవలయును. అంతమాత్రమున బ్రాహ్మణాదిపదవాచ్య లొకరికంటె నొకరు నీచులనియో, ఉత్తములనియో యెంచి, ఒకరి కొకరు దూరముగ నుండి పరస్పర సహకారభావమును విడిచి యుండుట మానవజాతికి శ్రేయస్కరము కాదు. వేదమునం దందువలననే యొకచో 'అజ్యేష్ఠాసః అకనిష్ఠాసః, ఏతే సంభ్రాతరో బభూవుః' మనుష్యులలో నొక రెక్కువ మఱియొకరు తక్కువ యని యెంచక మానవులెల్లరు భ్రాతృభావముతో నుండవలయునని బోధించుట చూడనగును.

అటులయిన బ్రాహ్మణాది పదములు జాతిని బోధింపకున్న పక్షమున నవి యేమి బోధించును? అను ప్రశ్న నుదయించును. మహర్షులు వానిని వర్ణబోధకములుగా నెంచిరి. వేదమున బ్రాహ్మణాదిపదములతో జాతిపదము కాని వర్ణపదము కాని యేదియు జోడించి ప్రయోగించినట్లు చూడము. కాని మహర్షులు వర్ణవాచకములుగా వానిని గ్రహించినట్లు సులభముగా తెలిసికొనగలము. 'వృణోతే రితి వర్ణః' అను నిరుక్త ప్రామాణ్యమువలన వరింపదగినది - స్వీకరింపదగినది వర్ణమని తెలియుచున్నది. గుణకర్మల ననుసరించి స్వీకరించునది వర్ణమని యెంచవలయును. వ్యక్తిలో నున్న గుణకర్మములను జూచి, వానిని తగిన వర్ణమునకు అధికారిని చేసి బ్రాహ్మణాదిపదములచే వ్యవహరించుటయు వర్ణమననగును. గురుకులమున నివసించి వటువు విద్యాబుద్ధులను నేర్చి స్నాతకుడగునాడు గురువు లతని

గుణకర్మములను బాగుగ నెఱింగి బ్రాహ్మణాది పదములచే నతడు వ్యవహరింపబడుట కధికార మొసంగెడివారు. కాబట్టి బ్రాహ్మణ క్షత్రియాదపదములు వర్ణబోధకములే కాని జాతివాచకము లెన్నడును గావు. అందువలననే బ్రాహ్మణాదులను గూర్చి వివరించుచు కృష్ణుడు అర్జునునితో నే మనెనో చూడుడు.

'శమో దమ స్తపః శౌచం క్షాంతి రార్జవ మేవ చ
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్' (భ.గీ.18-42)

'శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనం
దాన మీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్' 18-43

'కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యం కర్మ స్వభావజమ్,
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్' 18-44

'శమము, దమము, తపస్సు, శౌచము, క్షాంతి, ఋజుత్వము, జ్ఞానము, విజ్ఞానము నను గుణకర్మ స్వభావములుకలవాడు బ్రాహ్మ ణుడనబడుచున్నాడు. శౌర్యము, తేజస్సు, ధృతి, దక్షత, యుద్ధమున పాఱి పోకుండుట, దానము, ఈశ్వరభావము ననున వన్నియు కలవాడు క్షత్రియుడు. అట్లే వ్యవసాయము, వ్యాపారము, పశుర క్షణము నను నవి వైశ్యుడు చేయదగినవి. పరిచర్య - సేవచేయుట శూద్రుని స్వభావము'.

ఇట్లు గుణకర్మములు ముఖ్యప్రయోజకములుగ బ్రాహ్మణాది పద ములు వ్యవహారమునకు వచ్చినట్లు భగవద్గీతా శ్లోకమువలన తెలియుచు న్నది. ఈ వర్ణనమునుబట్టి చూచినను బ్రాహ్మణాది పదములు జాతివాచకములు కావనియు, గుణవాచకములు - వర్ణవాచకముల నియు బోధపడును.

జాతి నిత్యమగును. అది వ్యక్తి బ్రదికియుండగా మాఱదు. వర్ణము మాఱుచుండును. బ్రాహ్మణవర్ణు డొకడు క్రైస్తవాది మతాంతరములను స్వీకరించినపు డతడు బ్రాహ్మణపద వాచ్యుడు

కాడు. అట్టివాడు బ్రాహ్మణాది పదములతో వ్యవహరింపబడ కుండుట లోకవిదితమే. బ్రాహ్మణాది పదములచే వ్యవహరింప బడువారు వారి కర్తవ్య కర్మలను విడిచి, యన్య వర్ణగుణముల నలవఱుచు కొనిన పక్షమున వారు బ్రాహ్మణాది పదములచే పిలువబడరు. ఈ విషయమునే మనుస్మృతి యిట్లు చెప్పుచున్నది.

అనధీత్య ద్విజో వేద మన్యత్ర కురుతే శ్రమం
.......స శూద్రత్వ మాశు గచ్ఛతి సాన్వయః

'ద్విజుడు (బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులలో నొకడు) వేదమును జదువక ఇతర విషయములందు పరిశ్రమము చేసిన పక్షమున నతడు వెంటనే తనవంశము - పరివారముతోబాటు శూద్రు డగును'.

బ్రాహ్మణులైన తల్లిదండ్రులకు బుట్టినంత మాత్రమున బ్రాహ్మణులగుదురను నియమము ప్రాచీనకాలమున నున్నట్లు కనిపింపదు. ఇతర వర్ణములకు బుట్టినవారు కూడ బ్రాహ్మణులు కావచ్చును. ఛాందోగ్యోపనిషత్తులోని జాబాలికథను జదివినవారికి పై విషయము స్పష్టమగును. జబాల పరిచారికయై బ్రదికినది. ఆమె పుత్రుడు జాబాలి - సత్యకాముడు. సత్యము చెప్పినందున నాటిఋషు లతనిని బ్రాహ్మణునిగ వ్యవహరించిరి. జబాల కుల మేమో తెలియదు. తన కెవరి సంబంధము వలన కుమారుడు జన్మించినాడో కూడ తెలియదని యామె స్పష్టముగా చెప్పినది. అజ్ఞాతకులముల వారికి బుట్టిన జాబాలి - సత్యకాముడు బ్రాహ్మణుడైనాడు. ఇందు గుణకర్మలే ప్రయోజకములు.

ఇట్లే క్షత్రియ కులమున బుట్టిన విశ్వామిత్రుడు, చండాలకులమున బుట్టిన మాతంగుడు బ్రహ్మర్షులయినట్లు భారతాదులందు జూచుచున్నాము.

వేదాధ్యయనాదులవలన శరీరము బ్రాహ్మణ శరీరమగునని మనువు చెప్పుచున్నాడు.

స్వాధ్యాయేన జపై ర్హోమై స్త్రైవిద్యే నేజ్యయా సుతైః

మహోయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః 2-28

'స్వాధ్యాయము, జపము, హోమానుష్ఠానము, వేదాధ్యయనము, ఇష్టుల నొనరించుట, ధర్మపూర్వకముగ సంతానమును గనుట, బ్రహ్మయజ్ఞాది మహోయజ్ఞముల నొనర్చుట, అగ్నిష్టోమాది యజ్ఞముల నొనర్చుట - అను వీనివలన శరీరము బ్రాహ్మణ శరీరమగును' అను నీ మనువచనమును బట్టి చూచినను గుణకర్మలనుబట్టి బ్రాహ్మణు డనబడును కాని తల్లిదండ్రుల రజోవీర్యముల వలననే బ్రాహ్మణ తను వేర్పడదని తెలియుచున్నది. ఇంకను

శూద్రో బ్రాహ్మణతా మేతి బ్రాహ్మణ శ్చైతి శూద్రతామ్,
క్షత్రియా జ్జాత మేవం తు విద్యా ద్వైశ్యా త్తథైవ చ. మను 10-65

'గుణకర్మములవలన శూద్రకులమున బుట్టినవాడు బ్రాహ్మణు డగును. బ్రాహ్మణకులజుడు శూద్రుడగును. క్షత్రియవైశ్యులకు బుట్టినవారు కూడ అట్లే గుణకర్మములవలన బ్రాహ్మణులగుటయు, శూద్రులగుటయు కలదు'.

ఈ సందర్భమున బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణముల కర్తవ్యకర్మమును, గుణములును దెలిసికొనుట అవసరము.

బ్రాహ్మణులకు-

అధ్యాపన మధ్యయనం యజనం యాజనం తథా
దానం ప్రతిగ్రహశ్చైవ బ్రాహ్మణానా మకల్పయత్. మను 1-88

శమో దమ స్తపః శౌచం క్షాంతి రార్జవ మేవ చ
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్. భ.గీ.18-42

బ్రాహ్మణునకు చదువుట, చదివించుట, యజ్ఞము చేయుట, చేయించుట, దాన మిచ్చుట, పుచ్చుకొనుట! అను నీయాఱు కర్మములు (శమము) మనస్సునందు చెడ్డపని చేయు నిచ్ఛకూడ పుట్టనీయకుండుట - మనస్సును అధర్మమం దెన్నటికిని ప్రవర్తిం

పనీయకుండుట, (దమము) చెవి, కన్ను మొదలగు నింద్రియము లను అన్యాయాచరణములనుండి తొలగించి ధర్మమందే నడపించుట, (తపము) సదా బ్రహ్మచారియు జితేంద్రియుడు నయి ధర్మాను ష్ఠానము చేయుట, (శౌచము)-

అద్భి ర్గాత్రాణి శుధ్యంతి మనః సత్యేన శుధ్యతి
విద్యాతపోభ్యాం భూతాత్మా బుద్ధిర్ జ్ఞానేన శుధ్యతి. మను 5-109

జలముచే వెలుపలిఘంగములు, సత్యాచరణమువలన మనస్సును, విద్యాధర్మానుష్ఠానముల్లచేత జీవాత్మయు, జ్ఞానముచేత బుద్ధియు, పవిత్రములగును. లోపలి రాగ ద్వేషాదిదోషములను వెలుపలి మలములను దూరము చేసి శుద్ధముగా నుండుటచేత, వివేచనాపూర్వకముగ సత్యమును గ్రహించి యసత్యమును ద్యజించుటచేతను నిశ్చయముగ పవిత్రు డగు చున్నాడు. ఇదియే శౌచము. (క్షాంతి) నిందాస్తుతి, సుఖ దుఃఖ, శీతోష్ణ, క్షుధాతృష్ణ, హానిలాభ, మానావమానములయందు హర్షశోకములను వదలి ధర్మమందు దృఢనిశ్చయుడై యుండుట, (ఆర్జవము) కోమలత నిరభిమానము, సరలత - సరళస్వభావము కలిగియుండుట, కుటిలతాది దోషములను వదలివేయుట, (జ్ఞానము) సమస్త వేదాదిశాస్త్రములను సాంగోపాంగముగ జదివి, చదివించు సామర్థ్యము, వివేకము, సత్య నిర్ణయము, ఏవస్తువెట్లున్నదో దానినట్లే - జడమును జడముగాను, చేతనమును చేతనముగాను దెలియుట, నమ్ముట, (విజ్ఞానము) పృథివి మొదలుకొని పరమేశ్వరపర్యంతము పదార్థములను విశేషముగ దెలిసికొని వాని నుండి యథాయోగ్యమగు నుపయోగము గొనుట, (ఆస్తిక్యము) వేదము, ఈశ్వరుడు, ముక్తి, పూర్వాపరజన్మములు, ధర్మము, విద్య, సత్సాంగము, మాత-పిత-గురువు-అతిథిసేవ నెప్పుడు వదలక వీరి నెన్నడును నిందింపకుండుట - ఈ పదునైదు గుణకర్మములు బ్రాహ్మణవర్ణస్థుల కవశ్యముగా నుండవలయును.

క్షత్రియులకు-

ప్రజానాం రక్షణం దాన మిజ్యాధ్యయన మేవ చ
విషయే ష్వప్రసక్తిశ్చ క్షత్రియస్య సమాసతః. మను 1-89

న్యాయముగా ప్రజలను రక్షించుట, పక్షపాతమును వదలి శ్రేష్ఠులను సత్కరించుచు, దుష్టులను దిరస్కరించుచు నన్నివిధముల నందఱిని బాలించుట, (దానము) విద్య, ధర్మము అను వీనిప్రచారమందును, సుపాత్రుల సేవయందును, ధనాదిపదార్థములను వ్యయపఱచుట, (ఇజ్య) అగ్నిహోత్రాది యజ్ఞములను చేయుట - చేయించుట, (విషయే......శ్చ) విషయములందు దగులుకొనక జితేంద్రియుడయి సదా శరీరమును, ఆత్మను బలిష్ఠముగా నుంచుట.

శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం యుద్ధేచాప్యపలాయనం
దాన మీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్. భ.గీ.18-43

(శౌర్యము) వందలకొలది వేలకొలది శత్రువులతో నొంటిగా యుద్ధము చేయుటయందు భయపడకుండుట, (తేజము) సదా తేజస్వి - దైన్యమును వదలి ప్రగల్భుడై దృఢుడైయుండుట, (ధృతి) ధైర్యవంతుడై యుండుట, (దాక్ష్యము) రాజ ప్రజాసంబంధమగు వ్యవహారములందును, సమస్త శాస్త్రములందును అతి చతురుడై యుండుట, (యుద్ధే....) యుద్ధమందు దృఢుడై నిశ్శంకుడై యుండి యెన్నటికిని వెనుదీయకయు బరువెత్తకయు నుండుట - తన్ను బ్రతికించుకొని నిశ్చయముగా విజయము కలుగురీతిని యుద్ధము చేయవలయు ననుట, తాను బరుగెత్తి పోవుటచేతగాని, శత్రువులను మోసపుచ్చుటచేతగాని జయము గలుగనుండునేని అట్లే చేయుట, (దానము) దానశీలము కలిగియుండుట, (ఈశ్వరభావము) పక్షపాతరహితుడై అందఱితో యథాయోగ్యముగ వర్తించుట, విచారించి యిచ్చుట, ప్రతిజ్ఞను పూర్తిచేయుట, దాని కెప్పటికిని భంగము కలిగింపకుండుట - అను నీ పదునొకండును క్షత్రియవర్ణము గుణకర్మములు.

వైశ్యులకు........

పశూనాం రక్షణం దాన మిజ్యాధ్యయన మేవ చ
వణిక్పథం కుసీదం చ వైశ్యస్య కృషి మేవ చ. మను 1-90

(పశూ....ణమ్) గోవులు మొదలగు పశువులను బాలించుచు వృద్ధిపఱచుట, (దానమ్) విద్యా ధర్మములను వర్ధిల్లజేయుటకు ధనాదులను వ్యయపఱచుట, (ఇజ్య) అగ్నిహోత్రాది యజ్ఞములను జేయుట, (అధ్యయనమ్) వేదాదిశాస్త్రములను జదువుట, (వణిక్ప థమ్) అన్ని విధముల వ్యాపారము చేయుట, (కుసీదమ్) నూటికి నాలుగు, ఆఱు, ఎనిమిది, పండ్రెండు, పదియాఱు, ఇరువది యణా లకంటె నధికముగ వడ్డీ తీసికొనక అప్పిచ్చుట, మూలమునకు రెండింతలు అనగా నొక రూపాయి యిచ్చిన నూఱేండ్లలో రెండు రూపాయలకంటె నధికముగా పుచ్చుకొనకుండుట, ఈయకుండుట, (కృషి) పొలము పనిచేయుట - ఇవి వైశ్యుని గుణకర్మములు.

శూద్రునకు......

ఏక మేవ హి శూద్రస్య ప్రభుః కర్మ సమాదిశత్
ఏతేషా మేవ వర్ణానాం శుశ్రూషా మనసూయయా. మను. 1-91

నింద, ఈర్ష్య, అభిమానాదిదోషములను వదలి బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల సేవ యథారీతిని చేయుచు నందువలన దాను జీవించుట యొకటియే శూద్రుని గుణకర్మము. ఇట్లు సంక్షేపముగ నాయావర్ణముల గుణకర్మములు వ్రాయబడినవి. ఎవరెవరియందు నే యే వర్ణముల గుణకర్మము లుండునో వారివారికి నాయావర్ణ ముల యధికార మీయవలయును. ఇట్టి వ్యవస్థచే మనుష్యులందఱు నున్నతశీలు రగుదురు. ఏలయనగా దమసంతానము మూర్ఖత్వాది దోషయుక్త మయ్యెనేని శూద్రులయి పోదురను భయము ఉత్తమ వర్ణస్థులకు గలుగును. అట్లే బిడ్డలు కూడ దాము పైరీతి నడక గలిగి విద్యాయుక్తులు కారేని శూద్రులు కావలసివచ్చునని భయప డుదురు. ఇదియును గాక నీచ వర్ణస్థులకు నుత్తమ వర్ణస్థులగుట

కుత్సాహము వర్ధిల్లును. విద్యా ధర్మములను ప్రచారము చేయు నధికారము బ్రాహ్మణుల కీయవలయును. ఏలయనగా వారు పూర్ణ విద్యావంతులు, ధార్మికులు నయియుందురు గనుక నాకార్యమును యథాయోగ్యముగ జేయగలుగుదురు. క్షత్రియులకు రాజ్యాధికారమి చ్చుటచే నెన్నటికిని రాజ్యమునకు హానిగాని, విఘ్నముగాని కలుగదు. పశుపాలనాదుల యధికారము వైశ్యుల కిచ్చుటయోగ్యము. ఏలయ నగా వారీ కార్యమును బాగుగ జేయగలరు. శూద్రునకు సేవాధికార మీయవలయును. ఏలయనగా వాడు విద్యారహితుడు. మూర్ఖుడు నగుటచే విజ్ఞాన సంబంధమగు కార్య మేదియు జేయజాలడు. కాని శరీరసంబంధమగు కార్యము లన్నియు జేయగలడు. ఈ రీతిని వర్ణ ములను దమతమ యధికారములయందు ప్రవర్తింపజేయుట రాజు మొదలగు సభ్యజనుల కర్తవ్యము.

ఇక భారతీయులలో వృత్తులను బట్టి యెన్నో కులములు వ్యవ హారములో నున్నవి. కులము జాతికాదు. చాకిపని చేయువాడు చాకలి. మంగలిపని చేయువాడు మంగలి. పంతులుపని చేయువాడు పంతులు. కుమ్మరిపని చేయువాడు కుమ్మరి. చర్మముతో పనిచే యువాడు చర్మకారుడు-మాదిగవాడు. ఇట్లు ఎందఱో వారి పను లనుబట్టి భిన్ననామములు గల కులపదములతో జెప్పబడుచున్నారు. జన్మము - జాతి - పుట్టుకతో నీకులములకు సంబంధము లేదు: కావున కులములను జాతులనుట తప్పు.

పైన జూపినవిధమున వైదికవర్ణవ్యవస్థను గుర్తింపవలయును. వైదిక వర్ణవ్యవస్థకు జన్మతో నెట్టిసంబంధము లేదు. కావున మానవులు తమలో జాతిభేదమును పాటింపక యెల్లరు నొకే జాతికి చెందినవారుగా నెంచి యెల్లరు నెల్లరియోగక్షేమములకు పాటుపడుచు మానవాభ్యుదయమునకు తోడ్పడుట శ్రేయస్కర మగును. జాతిభేదమును పురస్కరించుకొని వ్యవహారములో నున్న ఉచ్చనీచభావములను విడనాడుట బుద్ధిమంతులకు కర్తవ్యము. విశ్వ సౌభ్రాతృత్వమున కయ్యది తోడ్పడును. విశ్వశాంతి కది సాధన మగును.

ఓమ్ తత్ సత్

ఓమ్

అవతార మీమాంస

హిందువులు రామకృష్ణాదుల నీశ్వరావతారములని యెంచుచున్నారు. క్రైస్తవులు 'ఏసు'ను దేవుని యవతారమందురు. ఇట్లే యితర జాతులును భిన్నభిన్న - ఈశ్వరావతారములయందు విశ్వాసముకలవారై యున్నారు. మహమ్మదీయులు మహమ్మదు నీశ్వరావతార మనకున్నను ఈశ్వర సందేశహరుడు (రసూల్ పైగంబర్) అని యెంచుచున్నారు. అనేక జాతులం దీశ్వరపుత్రులు ప్రసిద్ధినొంది యుండిరి. 'సికందర్' ఈశ్వరుని పుత్రుడని పిలువబడెను.

హిందువులొకచో పదియవతారములను, కొండొకచో నిరువది నాలుగవతారములను పేర్కొనుచున్నారు. శైవులేబది మూడవతారములని చెప్పుచున్నారు. అందు శ్రీరామచంద్రుడు ద్వాదశకళలతో నవతరించెను. శ్రీకృష్ణుడు షోడశకళాపరిపూర్ణుడు. ఇతరావతారములు నిట్లే భిన్నభిన్న కళలు గలవిగా వర్ణింపబడెను.

ప్రస్తుతమున కొందరు విద్యావంతులు అవతారముల నాధారముగాగొని వికాసవాదమును సిద్ధపరచుటకై యత్నించుటను మనము జూచుచున్నాము. మత్స్య కచ్ఛప వరాహాద్యవతారములు క్రమముగా వికాసవాదమున వర్ణించిన భిన్న భిన్న శ్రేణులని వారియభిప్రాయము. డార్విన్ మహోదయుడు సృష్టి నిర్మాణమున వర్ణించినట్లే మత్స్యాద్యవతారములందు వికాసము దృష్టిగోచర మగుచున్నదని వారియుద్దేశము.

అవతారమును సిద్ధింపజేయుట కొసంగబడు యుక్తులను తిలకించినపుడు ఈశ్వరుని యవతార విషయమున జనులవిచారములనిశ్చి

తములని తెలియును. అవతారములందు విశ్వాసముగలవారేవిధము నన్నైన, అవతార సిద్ధాంతము లోకమున స్థిరమైయుండవలయునని యెంచుచున్నట్లు తోచును.

అవతారశబ్దము 'అవ' ఉపసర్గ పూర్వక 'తృ' ధాతువువలన నేర్పడుచున్నది. దిగుట-లేక క్రిందికి వచ్చుట-అని దీనియర్థము. ఈశ్వరావతారమునకు, నిరాకారుడైన యీశ్వరుడు శరీరమునందవ తరించుటయని యర్థము. అనగా నీశ్వరుడు శరీరధారణ మొనర్చు నని తాత్పర్యము. ఈ విషయమున నీక్రింది ప్రశ్నలు వొడముట స్వాభావికము.

1) ఈశ్వరు డెట్టివాడు?

2) ఈశ్వర గుణములు మారునా?

3) ఈశ్వర గుణములను పరీక్షించిన అవతార మవసరమని తోచునా?

4) ఈశ్వరు డవతరించుట సంభవమా?

5) రామ కృష్ణాదులందు, వారిని మానవులనక ఈశ్వరావతారము లని యన దగువిశేషము లేమున్నవి?

6) ఈశ్వరు డవతరించునని యొప్పుకొనుటవలన మానవ జీవనము నకు కలుగు లాభమేమి?

7) వేదములందు రామ కృష్ణాద్యవతారముల వర్ణనలున్నవా?

1) ఈశ్వరుడెట్టివాడు? ఆస్తికులెల్లరు నీశ్వరుని జగత్కర్తయని స్వీక రింతురు. ఈశ్వరుడు పిపీలికాది బ్రహ్మపర్యంత మగు జగ త్తును రక్షించుచున్నాడు. పోషించుచున్నాడు. లయ మొన రించు చున్నాడు. అనగా సృష్టి స్థితి లయముల కతడు కర్త యని భావము. వేదాంత దర్శనమున వ్యాస మహర్షియునిట్లు సూత్రించి యున్నాడు.

"జన్మాద్యస్యయతః" 1-1-8 బ్రహ్మసూత్రములు..

జగమును సృష్టించి పోషించి లయము చేయువాడీశ్వరుడని సూత్రార్థము. దీనింబట్టి ఈశ్వరుడు అత్యంత సూక్ష్ముడనియు నిరాకారుడనియు బోధపడుచున్నది. అందువలననే యొకచో "అణో రణీయాన్ మహతో మహీయాన్" అని యీశ్వర విషయమున వర్ణింప బడియున్నది. స్థూలవస్తువు అతిసూక్ష్మవస్తువును నిర్మింప నసమర్థమగును. అత్యల్పములయిన బంగారు నగలు సమ్మెటచే నిర్మింప నశక్యములగును. నగలెంత సూక్ష్మములో సాధనములు నంతకంటె సూక్ష్మములై యుండవలెను. స్థూల వస్తువునందు సూక్ష్మవస్తువు ప్రవేశింప గలదు గాని, సూక్ష్మవస్తువునందు స్థూలము ప్రవేశింప నేరదు. ఈశ్వర నిర్మాణముననెంత సూక్ష్మ పదార్థములున్నవో గమనించుడు ! చీమకంటె పెక్కుమడుంగులు సూక్ష్మ ప్రాణులు ప్రపంచమున నున్నవి. వాని శరీరములందు వందలకొలది యవయవ ములును గలవు. వానిని మనము భూతద్దముల (దూరదర్శిని) సహాయముననుజూడనేరము. ఇట్టి వానిని నిర్మించు పదార్థము (ఈశ్వరుడు) అతి సూక్ష్మము నిరాకారము నగుటలో సందియమేల? అందువలన నీశ్వరుడు నిరాకారుడు సర్వవ్యాపకుడు గావలసియున్నాడు. అతడు పరమాణువులందును వ్యాపించియున్నాడు. పువ్వుల లోనున్న రంగులను మీరు చూచియుందురు. ఎంత సూక్ష్మ రచన! చిత్రకారుడు తనయతిసూక్ష్మమయిన కుంచెతో కూడ అట్లురంగు వేయజాలడు. నిరాకారుడయిన యీశ్వరుడే యిట్టి కార్యములందు సమర్థుడు. దీనినిబట్టి యీశ్వరుడు నిరాకారుడు సర్వవ్యాపకుడు సర్వజ్ఞుడునని తెలియుచున్నది. అతడు ఘటఘట వ్యాపి. సర్వశక్తిమంతుడు. శక్తిలేకున్న కార్యమెట్లు జరుగును? ఈ పదార్థమునే యొకానొక యుపనిషత్కారుడెట్లు సుందరముగా వర్ణించియున్నాడో పాఠకులు గమనింతురుగాత.

"న తస్యకార్యం కరణంచ విద్యతే
న తత్సమశ్చా భ్యధికశ్చదృశ్యతే,
పరాస్యశక్తిర్వివిధైవశ్రూయతే

స్వాభావికీజ్ఞాన బలక్రియాచ
తమాహు రగ్ర్యం పురుషం మహాంతం
అపాణిపాదో జవనోగ్రహీతా
పశ్యత్యచక్షుః స శృణోత్యకర్ణః
సవేత్తి వేద్యం నచతస్యాస్తి వేత్తా" ఇత్యాది

(2) ఈశ్వరగుణములు మారునా? అనగా నీశ్వరునియందు మార్పులు గలుగునా యని తాత్పర్యము. సర్వవ్యాపకు డేక దేశి కాగలడా? సృష్టియందుకల పదార్థములన్నియు మార్పులు నొందు చుండును. వీనిలో నీమార్పులేర్పడుటకు ముఖ్యకారణ మీశ్వరుడే. కాని కొన్నిపట్ల మానవులును నీశ్వరానుకూలముగా పదార్థములను మార్పగలుగుదురు. ఎట్లన కొయ్యనుమార్చి బల్లలను కుర్చీలను మరియు నితర వస్తువులను నిర్మించుచున్నారు. ఇట్లే సువర్ణమును కుండలాదుల నొనర్చుచున్నారు. కాని యీశ్వరుడు మాత్రము మార్పునొందువాడు కాడు. ఈశ్వరునిలో మార్పుగలిగిన నతనియందు నిర్బలత యేర్పడును. ఈశ్వరగుణములలో మార్పేగలిగిన నతడీ శ్వరుడేకాడు. నిరాకారుడు సాకారుడైనచో నతనియందు స్థూలత యేర్పడును. స్థూలత యేర్పడుటతోడనే సర్వవ్యాపకత నశించును. స్థూలపదార్థము సూక్ష్మవస్తువులందెట్లుండ గలదు? వ్యాపకత నశిం పగానే జ్ఞానము నందును కొఱత యేర్పడును. అందువలన నీశ్వరు డెన్నడును మార్పునొందదు. ఈశ్వరునిలో మార్పుచెందుటకు కార ణము ఈశ్వరుడేనా? అన్యాలా? స్వయముగా నతడుమారిన నతని యందేదోయొకదోషము అపూర్ణతయుండి యుండవలయును. పూర్ణ వస్తువెన్నడును మార్పునొందదు. పూర్ణపదార్థమపూర్ణమగునా? ఎన్నడును కాజాలదు. కాబట్టి యీశ్వరునందేవిధమయిన న్యూన తయు లేదు. అతడు మార్పునొందదు. ఈశ్వరుని మార్పున కన్య పదార్థము కారణమందుమా? కాదు. ఎందువల్లనన, నొకవస్తువును మార్పునొందించు వస్తువు దానికంటె బలవంతమైయుండవలయును.

ఈశ్వరునికంటె బలమగు వస్తువు మరియొకటిలేదు.

'నతత్స మశ్చాభ్యధికశ్చ దృశ్యతే'

అట్టిచో నీశ్వరునిలోని మార్పున కన్యవస్తువు కారణమన నెట్లు చెల్లును? కొంతమంది ఈశ్వరుడు సర్వశక్తిమంతుడగుటచే నతడు మారగలడందురు. పాపము ! వీరికి విచారించు శక్తిలేదని తోచు చున్నది. ఎట్లన, సర్వశక్తిమంతము కాని పదార్థము మార్పుచెం దగలదు. మార్పుచెందుట శక్తిమత్తతకు చిహ్నమేకాదు. అదినిర్బ లతా చిహ్నము. ప్రబల వస్తువులను మార్చుచుండును. కాబట్టి యీశ్వరుడు సర్వాధిక సంపూర్ణ బలుడగుటచే నితరపదార్థములను మార్చుచుండును. అతడు స్వయముగా నఖండుడు నిర్వికారుడు నేకరసుడు నై యున్నాడు. మార్పునొందువస్తువు మార్పునొందుటకు పూర్వమున్న స్థితికంటె మంచిస్థితికో చెడ్డస్థితికో వచ్చును. ఈశ్వ రుడు తానున్నస్థితికంటె మంచిచెడుగు స్థితులలో నెన్నడు మార్పు నొందువాడుకాడు. అపూర్ణవస్తువు నిండింపననువగును. పూర్ణము నెట్లు పూరింపగలము?

(3) ఈశ్వరుడిట్లపరివర్తనశీలుడై యుండ అవతారమెట్లుసిద్ధిం చును. మార్పునొందని వస్తువు అవతరింప జాలదు. ఈశ్వరుని యందు మార్పుగలుగ వీలులేదని పైనవర్ణించి యుంటిమి. కాబట్టి ఈశ్వరుడవతరింపజాలడు. ఈశ్వర కార్యములయిన సృష్టిస్థితిలయ ములు ఈశ్వరునిలో మార్పు నపేక్షింపకయే జరుగును. జరు గుచున్నవి. అందువలన నీశ్వరునకు జన్మించవలసిన యవసరము కనిపింపదు. దుష్టులను శిక్షించుటకును, శిష్టులను రక్షించుటకు నీశ్వరుడవతరించు నందురు. ఈశ్వరుడు జన్మించకున్న దుష్టు లను సంహరించుటకును శిష్టులను సుఖులనొనర్చుటకును సమ ర్థుడు కాడా? యనివారినడుగ వలసియుండును. కంసరావణాదులను సంహరించుట సూర్యచంద్రాద్యనంత పదార్థముల నిర్మించుటకంటె కఠినమా? కంసరావణాదులకు జన్మలనొసంగినదెవరు? ఈశ్వరుడు

వారిని నిర్మించలేదా? వారిని జన్మింపజేయుట కవతరించని ఈశ్వ రుడు సంహరింప నవతారధారణ నేలచేయును? జన్మింపజేయుట కంటె వస్తువును - నిర్మించుటకంటె - చంపుట - చెడగొట్టుట అతిసులభము. సాధారణ మనుజులు ఒక గడియారమును నిర్మింపజా లరు. కాని ప్రతిబాలకుడు దానిని చెడకొట్ట సమర్థుడు కాగలడు. ఇంతియకాక, నేడీశ్వరుడు దుష్టులను సంహరించుటలేదా? చంప కున్న వారందరు నమరులుగారా! ఈశ్వరుడు భక్తుల హస్తముల నున్నాడని కొందరెంచు చుందురు. భక్తులు కోరిన రూపమున భగవానుడు వారికి దర్శనమిచ్చునని వారి యభిప్రాయము. ఇదియం తయు ప్రమాదము నిజమారయ, ఈశ్వరుని నియమానుకూల ముగా నడచుకొనుటయే భక్తియనబడును. తనయిష్టమువచ్చినట్లెల్ల ఈశ్వరుని నటింపజేయుట భక్తికానేరదు. భక్తులకొరకీశ్వరుడు జన్మ, మరణములకులోనగు ననుటయు వారికొరకై వ్యభిచారాదులనొన ర్చుననుటయు, భక్తులమూర్ఖతకంటె వేరుగానేరదు. యజమానుని అనువర్తించువాడు సేవకుడగునుకాని, తనకను సన్నలతో యజ మానుని నడుపువాడు సేవకుడెట్లగును? అట్లే భక్తులు భగవానుని నియమముల ననుసరింతురుగాని భగవానుని తనయంగ్ళుల్యగ్రముల నడుప నర్హులుకాజాలరు. కాబట్టి యీశ్వరున కవతరించ వలసిన యవసరముగానము.

(4) ఈశ్వరుడవతరించుట సంభవమా? ఈశ్వరుడవతరించు ననుట యీశ్వరు నవమానించుటగును. ఈశ్వరుడు కౌసల్యాదే వక్యాదుల గర్భమునందు వ్యాపించియే యుండెను. అతడు సర్వ వ్యాపకుడు. అందువలన ఈశ్వరుడు కొండొక స్త్రీ గర్భమున నవతరించెను. నవమాసములు గర్భమునందుండి యనంతరము జన్మించెననుట మిగుల యవివేకతయగును. ఈశ్వరుడు చేయలేని కార్య మొందులేదని పలువురు తలంతురు. సర్వశక్తిమంతుడనగా వారియభిప్రాయమిదియే. కొన్ని పనులు చేయగలుగుటయే నిర్బలత యని వారెరుగరు. 'ఈశ్వరుడు నిర్బలుడు కాజాలడ'ని నేనందునేని నావాక్యమును తిరస్కరించు మూర్ఖులుండరనియెంచెద. ఈశ్వరుడు

నిర్బలుడుకాజాలడని యంగీకరించుటలో నెట్టిపాపమును గనిపించదు. ఎన్ని విధములయిన శక్తులున్నవో అవన్నియు నీశ్వరునందుగలవ నుటయే సర్వశక్తిమంతుడను శబ్దమున కర్థము. సర్వశక్తిమంతుడన సర్వకార్య కర్తయని యర్థముకాదు. ఈశ్వరుడు రామకృష్ణాది శరీరము లను ధరించి యటకార్యముల నాచరించునపుడు మిగిలినప్రపంచమున నెవరు కార్యముల నాచరించిరి? కాబట్టి యీశ్వరు డవతరించగలడు అవతరించుననుట అసంబద్ధ ప్రలాపములు మాత్రమగును.

(5) రామకృష్ణాదులు మహాపురుషులనుటలో నేరికి సందేహముం డదు. వారియందసాధారణ శక్తియుండెను. వారు చతురులు నేర్పరులునగుటయు నిజమే. కానివారినీశ్వరులనదగు విషయము వారియందేమియు గానరాదు. యోగదర్శనమున "క్లేశకర్మవిపాకా శయై రపరామృష్టః పురుష విశేష ఈశ్వరః" అన్నాడు పతంజలి మహర్షి. అనగా నీశ్వరునకు అవిద్యాది క్లేశములతోను, కర్మలతోను; కర్మఫలముల ననుభవించుటలోను ఎట్టిసంబంధము లేదని సూత్రాభి ప్రాయము. రామకృష్ణుల జీవనములలో నుత్తమమానవ చరిత్రము మాత్రము కనిపించును. వారిలో ధార్మిక భావముండెను. వీర్య శౌర్యాదులును జూడనయ్యెను. కాని వారెన్నడు సృష్టికార్యములందు పాల్గొనినట్లు కానరాదు. ఒక చిన్న చీమనుగాని దోమనుగాని సృష్టించి నట్లుకానము. ఇతరమానవుల వలెనే వారును అన్న పానములాచరిం చిరి. నిద్రామైథునములందును సమానులుగా నుండిరి. గార్హస్థ్యధర్మ ముల నాచరించిరి. సంతానమును బడసిరి. అవసరముపట్ల యుద్ధ ములందు శస్త్రాస్త్రముల నుపయోగించిరి. జయాపజయములకును లోనైరి. ఈకృత్యములన్నియు మానవజాతికి సంబంధించినవేగాని యీశ్వరునితో వీనికి నెట్టిసంబంధమును గానరాదు. రామకృష్ణా దులు ఈశ్వరులేగాని మానవలీలల నాచరించిరని కొందరందురు. ఇదియునొక యవివేకమునక తప్పదు. ఈశ్వరుడు మానవుని లీలల నాచరించుటకు జన్మించునా? మనుష్యులులేరా? ఇంతియగాక, మనుష్యలీలలనాచరింప యీశ్వరుడవతరించెననుటలో యర్థమేమి?

రామకృష్ణాదులలోను నితరమనుష్యులలోను నెట్టి భేదము లేదని యొప్పకొనుట కాదా? అట్టితరి రామకృష్ణు లీశ్వరు లెట్లగు దురు? కొందరు కృష్ణుని వెన్నదొంగిలించుట యందును, మురళి వ్రాయించుటయందును ముగ్ధులగుచున్నట్లు మిథ్యాభక్తిని జూపుచుం దురు. తామీశ్వరు నుపాసించుచున్నట్లు నెంతురు. క్రైస్తవులు నిట్లే క్రీస్తును శూలారోహణ మొనర్చినపుడు మరణించి తదు పరి మూడుదినములకు మరల బ్రతికి శిష్యులకు దర్శనోపదేశాదుల నొసంగినట్లెంతురు. కాని యీకృత్యములన్నియు సాధారణ మాన వులవని యీయమాయికు లెరుగరు. వీనియందు నీశ్వరత్వమును సూచించు కృత్యములేవి? సాధారణముగా చంచల బాలు రెల్లరు వెన్నను తినుబండారములను దొంగిలించుచుందురు. మురళీనాదము నొనర్చుచుందురు. అపరాధులయిన మనుజులకే శూలము నధిరో హించ వలసిన స్థితి యేర్పడును. ఈశ్వరునికీకృత్యములతో నేమి సంబంధమున్నది? కాబట్టి రామకృష్ణాదులు మానవులేగాని యీశ్వ రులు నీశ్వరావతారములు నెన్నడునుగానేరరు.

(6) రామకృష్ణాదుల నీశ్వరులని భావించినందువలన హిందువుల యాచారవిచారములందు యనర్థము వాటిల్లినది. ప్రథమానర్థము మూర్తిపూజ. హిందువులలో నవతార వాదమువలన మూర్తిపూజ వ్యాపించినది. రామ రామ సీతారామ-రాధేశ్యామ-రాధేశ్యామ యని జపియించుటే యీశ్వరపూజయయినది. రెండవ యనర్థమేమన, హిందువులు రామకృష్ణుల చరిత్రము ననుసరింపక వారు దేవుళ్ళని భావించి యాచరణ మానవాసాధ్యమని యెంచుచున్నారు. హిందూ జాతి పతనమునకిదియే కారణము. హిందూజాతి తన దుఃఖము లను దూరమొనర్చుటకు యత్నింపక దేవునిపై నాధారపడి యతని యవతారము నెదురు చూచుచున్నది. ఈశ్వరుడవతరించి తనకష్ట ములను పోనాడునని హిందువులు తలచుచున్నారు. హిందువులలో తమకర్తవ్యములను గుర్తించు శక్తి నశించినది. ఈశ్వరుడు తమ పురుషార్థమునకు ఫలరూపమున సహాయకుడగునను విశ్వాసమిపుడు

వారియందు గానరాదు. ఇప్పుడు కల్కి అవతారమునకై ప్రతీక్షనొనరించుచున్నారు. కొందరి దృష్టిలో కల్కి యుత్పన్నుడై ఎక్కడనో పరశురాముని దగ్గర విద్యాభ్యాసము నొనరించుచున్నాడు. ఈయ వివేక విచారములను వీడి రామకృష్ణాదులు మనుజులే వారివలె మనము నుత్తమ కార్యముల నొనరింపగలమను విశ్వాసము హిందువుల హృదయమునయున్న నేడు మరల సుఖ సంపదల ననుభవింపగలుగుదురు.

(7) వేదములయందు రామకృష్ణాద్యవతారముల వర్ణనలున్నవా? వేదములందు రామకృష్ణశబ్దములుండుటలో సందియములేదు. కాని రామకృష్ణులవతారపురుషులని వర్ణించినట్లెక్కడను కాననేరము. వేదములందట్లు వర్ణింపననువెద్ది? రాముడు త్రేతాయుగమువాడు. కృష్ణుడు ద్వాపరాంతము వాడు. వేదములు సృష్టిప్రారంభమున ప్రకాశింపబడినవి. నేటికెన్నో చతుర్యుగములు కడచియుండును. రామకృష్ణాదుల తాతముత్తాతలును వేదముల నధ్యయనముచేసి వేదోక్త ధర్మములను పాలించియుండిరి. వేదములందెక్కడను దశరథ పుత్రుడు రాముడనిగాని, వసుదేవపుత్రుడు కృష్ణుడనిగాని, వారిజీవిత వర్ణనలు గాని మనము జూడనేరము. రామకృష్ణ అది శబ్దములున్నంతమాత్రమున వేదములందవతార వర్ణనలున్నట్లెంచువారు స్వయముగా వంచింపబడుటయేగాక యితరులను వంచించుచున్నారు. దశరథాదులు తమబిడ్డలకు లోకవేదములందు ప్రచలితశబ్దములనే నామములుగా నుంచియుందురు. ప్రస్తుతము తల్లిదండ్రులు లోకమున వాడుకలోలేని శబ్దములను నామములకొరకు కల్పించుటలేదుగదా? ఒకని పేరు 'మోహనుడు' అని యెంచుడు. ప్రాచీనశబ్దకోశమునందు మోహకార్థక మోహనశబ్దముండుట జూచి తన వర్ణనయే యాకోశమునయున్నదని వాడెంచునేని మూర్ఖతగాక మరియేమగును? లోకమున సంస్కృత భాషల నాడు వారినామములు సంస్కృత శబ్దములకు సంబంధము గలవై యున్నచో నట్టిశబ్దములు వేదములందు దొరకకపోవు. అంతమాత్రమున ఆయానామములు గలవారి

వర్ణనలన్నియు వేదమున నున్నట్లేనా? వేదమంత్రములందెక్కడను 'రాముడుదశరథపుత్రుడు అతడీశ్వరావతారము కాని మానవలీలల నాచరించుచు సీతను వివాహమాడెను - అరణ్యమునకేగెను' - అనునిట్టి వర్ణన గనిపింపదు. శ్రీ సాయణాచార్యాదులును వేదము నందాయా తావుల గనుపించిన రామాది శబ్దములకు అంధకారాది అర్థములనే వ్రాసియున్నారు. నేడు కొందరుపండితులు అవతార సిద్ధికొరకాయా మంత్రములకు క్లిష్టకల్పనలద్వారా విరుద్ధార్థములను కల్పింపయత్నించుచున్నారు. కాని వారియత్నములన్నియు నిరర్థక ములే. సఫలులెట్లుకాగలరు? రామశబ్దము గల మంత్రమొకటి క్రింద జూపుచున్నాడ జూడుడు.

"భద్రోభద్రయాసచమాన ఆగాత్స్వసారో అభ్యతి
పశ్చాత్ సుప్రకేతైర్ద్యుభిరగ్నిర్వితిష్ఠన్నశద్భవథరభి
రామయస్థాత్" సామవేదః ఉత్తరార్చికా.12-5-3

ఈ మంత్రమున రామశబ్దమున్నది. సాయణాచార్యుడీ శబ్దము నకు "రామమ్ కృష్ణం శార్వరంతమః" రాత్రియందలి నల్లని చీకటి అని యర్థము వ్రాసియున్నాడు. కాబట్టి సాయణునిదృష్టిలో వేద మున రాముడవతారమని యున్నట్లు తెలియదు.

వాస్తవమున రామకృష్ణాదులు ఈశ్వరులుగాని, ఈశ్వరావతా రములుగాని కాదనిరుజువు చేయుటకు వారిచరిత్రములే చాలినంత సాక్ష్యమొసంగగలవు. వాల్మీకి రామాయణమునందు మున్ముందు నారద వాల్మీకుల ప్రశ్నోత్తరములను తిలకించిన రాముడు నరుడ నుట సుస్పష్టము.

" కోన్వస్మిన్ సాంప్రతం లోకేగుణవాన్..........
...............జ్ఞాతుమేవం విధం నరమ్" వా.రా.

ఇంతియగాక రామకృష్ణాదులు సాయంప్రాతః సంధ్యాదులనొన రించినట్లు చూడనగును. స్వయముగా వారీశ్వరులయిన మరెవరిని ధ్యానించిరి? ఇటివలననేకులు రామాదుల విషయములందనేక కల్పి

తగాధలనల్లిరి. వారిమూర్తులను కల్పించి పూజలనారంభించి పొట్ట పోసికొన నారంభించిరి. విచారకుల కీప్రక్రియలు విచారములు హీన తమములని తోచకపోవు. వస్తుతః యీశ్వరుడవతరించడు. అనగా శరీరమును ధరింపడు-జీవులు శరీరమును ధరింతురు. అనగా నవత రింతురు, చీమలు, దోమలు, పిల్లులు, కుక్కలు, గజములు, గుఱ్ఱ ములు, మనుష్యులు మున్నగు నవన్నియు జీవుని యవతారములు. జీవుడల్పశక్తిమంతుడు. అతడు తనకార్యముల నొనరించుటకు కర్మల ఫలముల ననుభవించుటకు శరీరముల నాశ్రయించును. ముక్తిని పొందువరకు జీవులు శరీరములందవతరింతురు. అతని కర్మలెంత నికృష్టములగునో అంతనీచమగు నవతారములతనికి గలుగును. ఎందు వల్లనన అవతారమునకు క్రిందికి దిగుట - పడుటయని యర్థము. అభౌతిక చేతనజీవుడు భౌతిక జడశరీరమున దిగినపుడు అతడ వతరించును. ఇంతమాత్రమున నవతారము సిద్ధించినదికదాయని భావింపకుడు. ఈ జీవావతారము లుపాసనా యోగ్యములు కావు. ఈశ్వరుడొక్కడే యుపాసనాయోగ్యుడు. అతడునిరాకారుడు. అజ న్ముడు. నిర్వికారుడు. అందువలననే వేదములందు "అజఏకపాత్" అని వర్ణింపబడియున్నది. అట్టి యీశ్వరునుపాసించుటయే మాన వకల్యాణమునకు హేతువగును. రామకృష్ణాదుల నైతిహాసిక పురుష లుగానెంచి వారి చరిత్రములను పఠింపుడు - వారియుత్తమ చరిత్ర ముల ననుసరింపుడు. వారిమూర్తులనునిర్మించి యీశ్వరస్థానమున పత్రపుష్పముల నర్పించి యీశ్వరోపాసన నొనరించితిమని ఆత్మవం చనకులోనుగాకుడు. ఆర్యులారా! యీశ్వరస్థానమున మరియొకని పూజించుట పాపమగును. పాపాచరణ శ్రేయస్కర మెట్లగును? విచారశక్తిని వినియోగించి శ్రేయోమార్గముల నధిగమింపుడు. అశు భంకర విచారములను ఆచారములను విడనాడి శాశ్వత సుఖము ననుభవింపుడు.

డా॥ పండిత గోపదేవ్

జననము : క్రీ.శ. 1900 ప్రాంతము

జననీజనకులు: శ్రీ అంబమాంబా రామయార్యులు

స్థానము : కూచిపూడి, తెనాలి తాలూకా

వృత్తి : వైదిక ధర్మ వ్యాపకత

రచనలు,

అనువాదములు: న్యాయ – వైశేషిక – సాంఖ్య – యోగ – వేదాంత దర్శనములు, ఈశ – కేన – కఠ – ప్రశ్న - ముండక - మాండూక్య ఐతరేయ – తైత్తిరీయ - శ్వేతాశ్వతర – ఛాందోగ్య – బృహదారణ్యకోపనిషత్తులు, ఆస్తికవాదము, అర్థ - ధర్మ మీమాంస, పంచమహాయజ్ఞవిధి, శ్రీమద్ భగవద్గీత, ఋగ్వేదాది భాష్యభూమిక, ఏసుక్రీస్తు రహస్య జీవనము, సంస్కారవిధి, ఋగ్వేద భాష్యభాస్కరము 1,2,3, – వైదిక పర్వ పద్ధతి, అపశూద్రాధికరణము మొదలగు చిన్న పుస్తకములు 25, సత్యార్థ ప్రకాశము, నిరుక్తము etc.